## 'కామ్ కీ బాత్'పై మాట్లాడరేం?

శ్రీనగర్ : ప్రధాని మోదీ 'మనసులోని మాటల'ను చెబుతున్నారే తప్ప ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన 'పనుల మాటల'ను మాట్లాడడం లేదని విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. శ్రీనగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ మోదీ 'మన్ కీ బాత్'కే పరిమితమయ్యారే తప్ప 'కామ్ కీ బాత్'ను పట్టించుకోవడం లేదని అన్నారు. ధరల పెరుగుదలను ప్రస్తావించడం లేదని చెప్పారు. దేశ రాజకీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ... మోదీ ముఖకవళికల్లో మార్పులు వచ్చాయని అన్నారు. "గత లోక్‌సభ ఎన్నికల్లో '56 అంగుళాల ఛాతీ' గురించి మీరు వినేవారు. ఆ మాటలు ఇప్పుడు వినబడుతున్నాయా? ఆయన ముఖ కవళికలు, మూడ్ మారాయి. మోదీ మనస్తత్వాన్ని కాంగ్రెస్, ఇండియా కూటములు కలిసి మార్చేశాయి" అని వ్యాఖ్యానించారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 244 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 సెప్టెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

# 'స్థానికం'పై గురిపెట్టి...!

## మరో రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తున్న రేవంత్..!




## స్కెచ్ మామూలుగా లేదుగా?

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిస్థానిక సంస్థలకు రెడీ అవుతున్నారు. నేతలను అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బతీసేలా కసరత్తులు చేస్తున్నారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలనే ఆలోచనతో రేవంత్ రెడ్డి ఉన్నారు.

అందుకోసం అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా పథకాలను అందించి ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకోసం రేవంత్ రెడ్డికాంగ్రెస్ శాసన సభ పక్ష సమావేశం కూడా నిర్వహించారు. సమావేశం మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగడంపైనే సాగింది. తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడు రావడంతో అన్ని రకాలుగా ముందుకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై చర్చించారు. అందుకోసమే ప్రత్యేకంగా సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నేతలకు నియోజకవర్గాలుగా బాధ్యతలను అప్పగించి.. అక్కడి ప్రధాన సమస్యలపై రానున్న కాలంలో దృష్టి పెట్టి నోటిఫికేషన్ కు ముందే ప్రజల మనసులను గెలిచే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. 100 శాతం స్ట్రైయిక్ రేట్ తో విజయం సాధించాలనే లక్ష్యాన్ని నేతలకు విధించినట్లు తెలిసింది. దీంతో పాటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను కూడా బలహీన పరిచేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మరిన్ని పథకాలను వీలైనంత త్వరగా అమలు చేయాలనే నిర్ణయానికి సీఎం రేవంత్ వచ్చారు. దీనికోసం రోడ్ మ్యాప్ ను రెడీ చేస్తున్నారు. అమలు చేసిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మిగిలిపోయిన రైతు భరోసా, మహా లక్ష్మి పథకంలో కొన్నింటిని అమలు చేయడంపై కసరత్తులు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఒకే మాట మీద ఉండాలని.. సమన్వయం లేకుండా ప్రకటనలు చేస్తే ప్రతిపక్ష పార్టీలకు ఊతమిచ్చినట్లు అవుతుందనే అభిప్రాయంతో రేవంత్ ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు రుణమాఫీ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ దిశా నిర్దేశం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి అమృత్ టెండర్ల పేరుతో కుట్రకు తెర లేపారు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే భారీగా ముడుపులు వచ్చే కార్యక్రమాలపైన దృష్టి పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్లకుంట్ల తారక రామారావు ఆరోపించారు. అమృత్ టెండర్లపై కేటీఆర్ ఇవాళ(మంగళవారం) ప్రెస్‌నోట్ విడుదల చేశారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల పేరుతో కుట్రకు తెర లేపారని ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఒకటి రెండు నెలల్లోనే తాను గతంలో బాధ్యతలు నిర్వహించిన మున్సిపల్ శాఖలో సీఎం రేవంత్ వివిధ పనులకు టెండర్లు పిలిచారని అన్నారు. 26 పురపాలక పట్టణాల్లో తాగునీటి ప్రాజెక్టులు సీవరేజ్ పనులకు సుమారు 9000 కోట్ల రూపాయల టెండర్లు పిలిచారని తెలిపారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన టెండర్ల గడువు ప్రక్రియ పూర్తయిందని కేటీఆర్ పేర్కొన్నారు.

**టెండరింగ్‌కు సంబంధించి ఏ సమాచారం లేదు...** "ఈ టెండర్లలో సీఎం రేవంత్‌కు సంబంధించిన కంపెనీలను దొడ్డి దారిన ప్రవేశపెట్టి పనులు అప్పగించారు. అందుకే ఈ మొత్తం వ్యవహారం తాలూకు సమాచారాన్ని ప్రభుత్వం ఏ వెబ్‌సైట్లోనూ ఉంచలేదు. ఇన్ని వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పనుల టెండరింగ్ ప్రక్రియ పూర్తి అయిన ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి ఒక్క పత్రిక ప్రకటన కూడా రాలేదు. ఏయే ప్రాంతాల్లో పనులను పిలిచారు.

ఎక్కడ ఏ ఏ కంపెనీలకు టెండర్లు దక్కాయి. టెండర్ పనుల విలువ వంటి ఏ సమాచారాన్ని కూడా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచలేదు. అయితే టెండర్లు దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ లిస్టెడ్ కంపెనీ కావడంతో... వారికి దక్కిన టెండర్ల తాలూకు సమాచారాన్ని సెబీకి ఇవ్వాల్సి వచ్చింది.



దీంతో ఈ టెండర్ల స్కామ్ బయటకు వచ్చింది. ఈ కంపెనీ సెబీకి ఇచ్చిన సమాచారం ప్రకారం రూ.1137 కోట్ల టెండర్లను సంస్థ దక్కించుకుంది" అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

**శోధా కన్స్‌స్ట్రక్షన్‌కు ఎలాంటి అర్హతలు లేవు...** "ఈ టెండర్లలో 80% పనులను మరో రెండు కంపెనీలకు జాయింట్ వెంచర్ రూపంలో ఇస్తున్నట్లు తెలిపింది. ఈ రెండు కంపెనీల్లో ఒక కంపెనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయానా బావమరిది సూదిని సృజన్ రెడ్డి సంస్థ అయిన శోధా కన్స్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఈ కంపెనీకి ఈ జాయింట్ వెంచర్‌లో భాగస్వామ్యం ఉంది. ఈ కంపెనీకి ఎలాంటి అర్హతలు లేకపోవడంతో నేరుగా టెండర్లలో పాల్గొనలేదు. ఈ ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీపైన ఒత్తిడి తీసుకువచ్చి టెండర్లు వేయించి అందులో 80% పనులను ముఖ్యమంత్రి బావమరిది ఆయన బినామీ కంపెనీలకు అప్పచెప్పారు. ఈ శోధా కన్స్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆర్థిక సామర్థ్యం కూడా లేదు. ఈ కంపెనీ రెవెన్యూ ఏడాదికి కేవలం రూ.71 కోట్లు మాత్రమే, రూ. 2 కోట్లు మాత్రమే లాభం కలిగిన ఈ కంపెనీ ఇన్ని వందల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన అర్హతలు లేకపోవడంతో నేరుగా టెండర్లలో పాల్గొనని ఈ కంపెనీ దొడ్డిదారిన అవే పనులను చేపట్టడం సరైనది కాదు" అని కేటీఆర్ తెలిపారు.

**అధికారాన్ని అడ్డుపెట్టుకుని రేవంత్ అమృత్ టెండర్‌ను కట్టబెట్టారు...** "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన కుటుంబ సభ్యులకు వందల కోట్ల రూపాయల టెండర్‌ను కట్టబెట్టడం ముమ్మాటికి ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం. దీంతోపాటు తమ కుటుంబ సభ్యులకు అనుచితమైన ఆర్థికలబ్ధిని కలిగించేందుకు తమ పదవిని అడ్డు పెట్టుకోవడం అనేది ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కింద కూడా నేరం. ఇవే ఆరోపణలపైన గతంలో ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ (నేషనల్ అడ్వైజరీ కమిటీ), మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ చవాన్ (ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కాం), కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప (తమ కుటుంబ సభ్యులకు ఇల్లీగల్ మైనింగ్ అప్పజెప్పడం) వంటి ఆరోపణల కింద పదవిని కోల్పోయారు. ఇవే అంశాలతో మేము కచ్చితంగా ముఖ్యమంత్రి వ్యవహారాలను అమృత్ టెండర్ల స్కాంను సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం. అయితే సుమారు తొమ్మిది వేల కోట్ల రూపాయల ఈ అమృత్ టెండర్ల విషయంలో రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన బినామీ కంపెనీలతో చాలా కంపెనీలు సబ్ కాంట్రాక్టులు తీసుకున్నాయి. ఇది కేవలం అందుబాటులోకి వచ్చిన సమాచారం మాత్రమే.

ఈ వ్యవహారంలో జరిగిన వందల కోట్ల అవినీతి తాలూకు ఒక్క ఉదాహరణ మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ టెండర్ల తాలూకు మొత్తం వివరాలను బయటపెట్టి ఆ టెండర్లను రద్దు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.




నాంపల్లి కోర్టులో మంగళవారం ఓటుకు నోటు ఈడీ కేసులో విచారణ జరిగింది. ఈ రోజు కోర్టు విచారణకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఈ కేసులో రేవంత్ రెడ్డితోపాటు నిందితులుగా ఉన్న మత్తయ్య, ఉదయ్ సింహా, కేం కృష్ణ కీర్తన్, సండ్ర వెంకట వీరయ్య, సెబాస్టియన్ లు కూడా విచారణకు హాజరు కాలేదు.

దీంతో నిందితుల గైర్హాజరుపై నాంపల్లి కోర్టు అసహనం వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 24న జరిగే విచారణకు మినహాయింపు ఇవ్వాలని నిందితులు కోర్టును కోరారు. ఈ మేరకు తదుపరి విచారణ అక్టోబర్ 16న ఉంది. అక్టోబర్ 16న తప్పకుండా విచారణకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు సీఎం రేవంత్ రెడ్డిని ఆదేశించింది. రేవంత్ రెడ్డితోపాటు ఓటుకు నోటు కేసులో నిందితులందరూ అక్టోబర్ 16న కచ్చితంగా కోర్టుకు రావాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది.

# మార్గదర్శకాలు సిద్ధం

## సాయంలో రైతులకు బంపర్ ఫిట్టింగ్ పెట్టిన రేవంత్..!




హైదరాబాద్ : రైతు భరోసా కింద వచ్చే నెలలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రిలీజ్ చేయనున్నారు. ఆ వెంటనే విడతలవారీగా వానాకాలం పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి సాగు చేసిన భూములకే రైతు భరోసా ఇచ్చేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని పలు వేదికల మీద మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో రైతు బంధు స్కీమ్ లో భారీగా నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గుర్తించింది. పంటలు పండని రాళ్లు, రప్పల భూములు, గుట్టలు, హైవేలు, రోడ్లు, వెంచర్లకు, భూసేకరణ కింద పోయిన భూములకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వృథాగా చెల్లించినట్టు తేల్చింది. దీంతో పెట్టుబడి సాయం పంపిణీ విధి విధానాల ఖరారుకు సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీ వేశారు. ఈ కమిటీ వివిధ జిల్లాల్లో మీటింగ్‌లు ఏర్పాటు చేసి.. రైతులు, రైతు సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఇందుకు తగ్గట్టుగా రైతుభరోసాకు కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు కింద రైతుకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు 5 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం ఇచ్చింది.

దీంతో ప్రతి సీజన్ కు సగటున సర్కారుపై 7వేల 600 కోట్ల భారం పడేది. నిజానికి చిన్న రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ స్కీమ్ ను తీసుకొచ్చారు. పెద్ద రైతులకే ఎక్కువ లబ్ధి జరుగుతున్నదనే విమర్శలు వచ్చాయి.

దీంతో ఈ సారి పెట్టుబడి సాయానికి సీలింగ్ పెట్టాలని నిర్ణయించింది. రైతు భరోసా కొత్త మార్గదర్శకాలతో పాటే ఎన్ని ఎకరాలకు ఇస్తారనే క్లారిటీ ఇవ్వనుంది. బడ్జెట్‌లో మాత్రం ఎప్పటిలాగే రైతుభరోసా కోసం ప్రభుత్వం దాదాపు రూ. 15 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సాగు లెక్కల ప్రకారం ఈ వానాకాలం సీజన్‌లో 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి, పత్తి పంటలదే అగ్ర భాగంగా ఉంది. ఏ రైతు ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేశారో ఏఈఓలు ట్యాబ్‌లలో నమోదు చేశారు. దాని ప్రకారమే పంట కొనుగోళ్లు కూడా చేపట్టనున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొత్తం సాగైన భూములకు ఎకరాకు 7వేల 500 చొప్పున రైతు భరోసా ఇస్తే దాదాపు 10 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. కేబినెట్ సబ్ కమిటీ చేపట్టిన అభిప్రాయ సేకరణలో అత్యధికంగా ఏడున్నర ఎకరాలలోపే పెట్టుబడి సాయం ఇవ్వాలని, ఆ తర్వాత 10 ఎకరాలకు పరిమితం చేయాలనే ప్రతిపాదనలు వచ్చాయి. కేబినెట్ సబ్ కమిటీ చేసిన ప్రపోజల్స్‌పై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాక ఫైనల్ చేయనున్నారు. ఈ సారి వ్యవసాయేతర భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు భరోసా ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. నాన్ అగ్రికల్చర్ భూములను ధరణి సాగు పట్టా భూముల లిస్ట్ నుంచి తీసేస్తున్నది. ఇలా కనీసం 20 లక్షల ఎకరాలు తీసే చాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో దాదాపు రూ. 1వేయి 500 కోట్ల రూపాయల దుబారా ఖర్చు తగ్గే అవకాశం ఉంది. ఇక రైతు బంధు ప్రారంభం నుంచి గత వానాకాలం సీజన్ వరకు దాదాపు రూ. 73 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి సాయం కింద అందించారు. సాగులో లేని రాళ్లు రప్పలు, గుట్టలకు, వెంచర్లకు, ఇండ్లకు, హైవేలకు, రోడ్లకు ఇతరత్రా వాటికి ఏకంగా రూ. 25 వేల కోట్లు చెల్లించినట్టు ప్రభుత్వం గుర్తించింది. అంటే ఏడాదికి యావరేజ్‌గా రెండు సీజన్లలో కలిపి రూ. 3 వేల కోట్ల మేర దుబారా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# సంపాదకీయం

## ఈ దెబ్బతో శాఖాహారులు మటాష్ ?

ఈ దేశంలో ఎక్కువగా శాఖాహారులు ఉన్నారు. దాదాపుగా 143 కోట్ల మంది ప్రజానీకం ఉన్న భారత్ లో మూడవ వంతు దాకా శాఖాహారులు ఉన్నారని అధ్యయనాలు తెలియ చేస్తున్నారు. వారంతా కనీసం కోడి గుడ్డు వైపు కూడా తొంగి చూడరు. ఇక కొన్ని కీలక కులాలలో మొదటి నుంచి శాఖాహారం అన్నది ఒక ఆహార విధానంగా ఉంటూ వస్తోంది. వారు ఎక్కడికి వెళ్ళినా తాము శాఖాహారులమని చాలా గొప్పగా గర్వంగా చెప్పుకుంటారు. దానిని తరాలుగా ఆ కటుంబీకులు పాటిస్తూంటారు. అలా వారి రక్తంలో అనువంశీకంగా ఆ శాఖాహారం ప్రవహిస్తూ వస్తోంది. కానీ అంతటి వారి ప్రాతివత్యాన్ని శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగింది అన్న ప్రకటన ఒక్కసారిగా భంగం చేసిందా అన్న చర్చ వస్తోంది. ఇందులో సాధుసంతులు ముక్కు మూసుకుని తపస్సు చేసుకున్న వారు కూడా ఉన్నారు. అలాగే ఆగమ శాస్త్రాలను పూర్తిగా వంటబట్టించుకుని జీవితాంతం దేవుడికే జీవితాన్ని అంకితం చేసిన వారు కూడా ఉన్నారు వీరంతా తమ శాఖాహార జీవితం ఒక అద్భుతం అని దేవుడి ప్రసాదితమని భావిస్తూ ఉంటారు. ఇపుడు వారంతా దిగులు పడేలా ప్రకటన ఉంది. అది టీడీపీ కూటమి నుండి వచ్చింది. తాము విన్నది తప్పు కావాలని అలా జరిగి ఉండకూడదని వారు ఒకటికి వేయి సార్లు మొక్కుకున్నా అది నిజం అని టీడీపీ కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఒక్కసారి తప్పు కాదు ఏకంగా అయిదేళ్ళూ ఇదే తీరుగా సాగింది అని చెబుతోంది. దానికి అధారం ఏంటి అంటే జూలై 6 జూలై 12న వచ్చిన నాలుగు నెయ్యి ట్యాంకర్లలో కల్తీ జరిగిందని అందులో జంతువుల కొవ్వు కలిసింది అని నివేదికలు వచ్చాయని అంటోంది. ఇదే తీరుగా అయిదేళ్ళు జరిగి ఉండవచ్చునని ఎందుకంటే క్వాలిటీ టెస్ట్ అన్నది వైసీపీ ప్రభుత్వం అప్పట్లో సరిగ్గా చేయించలేదని అంటోంది. ఇక చంద్రబాబు మీడియా ముఖంగా చెప్పిన మాటలు వింటే శాఖాహారుల వ్రతం అంతా పూర్గిగా గంగ పాలే అనిపించకమానదు. అదేంటి అంటే నాలుగు ట్యాంకర్ల నెయ్యిని ఎన్డీ డీబీ ల్యాబ్ కు పంపిస్తే వచ్చిన రిపోర్టులలలో ఏకంగా గొడ్డు కొవ్వు, పంది కొవ్వు చేప నూనె వంటివి నెయ్యిలో కలిసినట్లుగా ఉందని ప్రభుత్వం చెబుతోంది. అంటే గడచిన అయిదేళ్ళ వైసీపీ ఏలుబడిలో ఒక్కసారి అయినా తిరుపతి వెళ్ళి లడ్డూ తిన్న వారు తెలియకుండానే వీటిని కూడా స్వీకరించారన్నదే దీని వెనక ఉన్న అర్ధం అని అంటున్నారు. మరి ఇలా ఇన్ని రకాల కొవ్వు కలసిపోయిన దాన్ని తిన్న వారు అంతా శాఖాహారులు ఎలా అవుతారు అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతోంది. అయితే ఇక్కడ చర్చ అంతా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన టెస్టులలో ఇలా తేలింది కాబట్టి గతంలో జరిగి ఉండవచ్చు అన్న అంచానాల మేరకే. మరి దీని మీద ఆధారాలు అయితే లేవు అనే అంటున్నారు. ఎందుకంటే ఆ లడ్డూలు లేవు, ఆ తయారీ లేదు, ఆ నెయ్యి లేదు. అదంతా ఇపుడు ఎక్కడా కనిపించదు. మరి సిట్ విచారణలో అయినా గతంలో ఏమి జరిగింది అన్నది ఎంతో కొంత ఆధార సహితంగా వివరాలు బయటకు తెస్తే ఓకే. లేకపోతే మాత్రం అంచనాలు అనుమానాల మధ్య దేశంలోని శాఖాహారులు అంతా మటాష్ అనే అనుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. సో ఇదంతా పిటీగానే చూడాల్సి ఉంది.

# రాష్ట్రపతి నల్సార్ విశ్వవిద్యాలయానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేయుచున్న సందర్భంగా అప్రమత్తంగా ఉంటూ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టరు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ నెల 28న నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి విచ్చేయున్న సందర్భాన్ని పురస్కరించుకొని సంబంధిత శాఖల అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో జిల్లాలోని హాకీంపేట్ ఎయిర్పోర్టుకు ముందుగా చేరుకొంటారని అక్కడ అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టరు సూచించారు. నల్సార్ యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కీసర ఆర్డిఓను సూచించారు. రోడ్ల మరమ్మత్తులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్తు, పుష్పలంకారణ, వైద్య శిబిరాలు, అంబులెన్సు, సీటింగ్, మొబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేస్తుకుంటూ సకాలంలో పనులు పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. నల్సార్ యూనివర్సిటి అధికారులను సమన్వయం చేస్తుకుంటూ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పరిశీలిస్తూ పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టరు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని అలాగే గౌరవ భారత రాష్ట్రపతి తిరిగి వెళ్ళే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు కలెక్టర్ గౌతమ్ చేశారు. సమావేశంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, అర్ అండ్ బి జిల్లా అధికారి శ్రీనివాసులు, పోలీసు, వైద్య, విద్యుత్తు, పర్యాటక శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తమ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలి




శామీర్ పేట, గరుడ వార్త : ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ రేణుక తెలిపారు. మంగళవా రం శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపల్ లో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 కార్యక్రమములో భాగంగా"స్వచ్ఛతా హీ సేవా" 2024 కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం వారిచే తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తడి, పొడి చెత్త సేకరణ పై సాంస్కృతిక కార్యక్రమాల తో అవగాహన కల్పించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంట్లో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాద్యాయులు, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కన్నేశ్వర్ రావు, జవాన్లు, ఆర్.పి లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల దండు



యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామం పరిశ్రమలకు నిలయంగా మారింది. రాజధానికి సమీపంలో, హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని గ్రామం ఉండటంతో పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంది. ఈ గ్రామంలో 11,527.26 ఎకరాల భూమి ఉండి, అతి పెద్ద రెవెన్యూ గ్రామంగా మారింది. ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా ఎక్కువగా ఈ గ్రామంలో ఉన్నాయి. దీని మూలంగా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఈ గ్రామాన్ని ఎంపిక చేసుకొని పలు పరిశ్రమలను స్థాపించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక దేశంలోనే తొలిసారిగా నిర్మించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కును ఈ గ్రామంలోనే ఏర్పాటు చేసింది. 2019 నవంబరు 1న ఈ పార్కును ప్రారంభించారు. 542 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ పారిశ్రామిక పార్కులో మొత్తం 510 పరిశ్రమలను విడతల వారీగా నెలకొల్పనున్నారు. ఇప్పటికే దాదాపు 150 పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయి. ఉత్పత్తులను ప్రారంభించిన, నిర్మాణాలు ఉన్న పరిశ్రమల్లో కలిపి సుమారు పది వేల మంది వరకు కార్మికులు ఉపాధిని పొందుతున్నారు.

ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ప్రింటింగ్, ప్యాకింగ్, ఫార్ములేషన్, టైల్స్, వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసే బ్రికెట్స్, కాలుష్యరహిత పరిశ్రమలు ఉన్నాయి. ఈ పార్కు పక్కనే చేనేత కార్మికులకు చేయూతనందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో టెక్స్టైల్ పార్కును నెలకొల్పారు. వీటిని ఆనుకొని రైస్‌హబ్, బొమ్మల పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయి. జాతీయ రహదారికి అనుకొని రూ. 2,800 కోట్లతో నిర్మిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) టెర్మినల్ ప్రారంభానికి సిద్ధమైంది. రూ. 1500 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. ఇవి కాకుండా రసాయన పరిశ్రమలు, క్వారీ, క్రషర్ మిల్లులు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలే కాకుండా ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝూర?ండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, అసోం, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఈ పరిశ్రమల్లో పని చేస్తుంటారు. ఇంకా ప్రభుత్వం ఈ గ్రామ పరిధిలో పలు కొత్త ప్రాజెక్టులు కూడా తీసుకొచ్చే అవకాశం ఉంది.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు





అమ్మవారికి బోనం నిర్వహించి, ఒడి బియ్యం పోశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శామీర్ పేట మండలం మజీద్ పూర్ ప్రజా హోమ్స్ లో నివాసముంటున్నబాలాజీ, గాయత్రి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిదిష్, మోనిష్ లు, అలాగే ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# వృద్ధురాల్ని బంధించి బంగారం, వెండి చోరీ

శామీర్ పేట, (గరుడ వార్త): ఎదురింట్లో అద్దెకు దిగినట్టుగా నటించి, ఇంట్లోకి పిలిచి వృద్ధురాలిని బంధించి, తన ఒంటిపై ఉన్న బంగారం వెండిని బలవంతంగా లాక్కొని పరారైన దొంగలు. వివరాల్లోకి వెళితే షామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు చింతలపల్లి మండల జగన్ గూడా గ్రామస్తురాలైన రాములమ్మ, తన ఇంటి ఎదురుగా ఓ ఇంట్లో అద్దకు దిగిన భార్యాభర్త నలుగురు పిల్లలు... మృదురాళ్లతో గత ఆరు రోజులుగా నమ్మకస్తులుగా నటిస్తూ వృద్దిరాలతో తరచుగా మాట్లాడుతూ ఆమె ఒంటిపై ఉన్న బంగారంపై కన్నేశారు. దాన్ని కాజేయాలని పన్నాగం పన్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి సదర అద్దకొచ్చిన దొంగలు, తమ ఇంట్లో బర్తడే





పార్టీ ఉందని చెప్పి వృద్ధురాలిని వారు అద్దెకు ఉంటున్న ఇంట్లోకి పిలుచుకొని బంధించి, రాములమ్మ ఒంటిపైనున్న సుమారు పది తులాల బంగారం, 20 తులాల వెండిని బలవంతంగా గాయాలు చేసి మరి లాక్కొని కుటుంబ సభ్యులంతా పరారయ్యారు. దీంతో ఆలస్యంగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు, గాయాలైన వృద్ధురాలిని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన షామీర్పేట పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నారు.

## మహమ్మారి మళ్లీ వస్తోంది..!

నల్గొండ : వంకలు తిరిగిన అవయవాలు.. నడ్డి విరిగి మంచానికే పరిమితమైన బతుకులు.. రెండు దశాబ్దాల క్రితం మునుగోడు, మర్రిగూడ, నాంపల్లి, దేవరకొండ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ మహమ్మారితో చాలా ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలివి. కాలక్రమేణా ప్రభుత్వాలు తీసుకున్న చర్యలతో ఫ్లోరైడ్‌తో అల్లాడిన ప్రజలకు కొంతలో కొంత ఉపశమనం దొరికింది. అయితే తాజాగా నీటిపారుదల శాఖ క్షేత్రస్థాయిలో చేసిన అధ్యయనంలో ఉమ్మడి జిల్లాలోని 18 మండలాల్లోని భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ అత్యధికంగానే ఉన్నట్లు తేలింది.
ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిబంధనల ప్రకారం నీటిలో 1.5 పీపీఎం ఫ్లోరైడ్ ఉంటే అది ప్రజలు తాగడానికి అవకాశం ఉంటుంది. తాజా అధ్యయనం ప్రకారం నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో పీపీఎం స్థాయి భూగర్భజలాల్లో 10 పీపీఎం కంటే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దేశంలో అత్యధికంగా ఫ్లోరైడ్ నమోదయ్యే మునుగోడు నియోజకవర్గం నుంచే గత భారాస ప్రభుత్వం మిషన్ భగీరథను ప్రారంభించింది. ఫ్లోరైడ్ కేసులు గత కొన్నాళ్లుగా నమోదు కావడం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగానే ఉన్నట్లు తెలుతున్నాయి.



గత కొన్నాళ్లుగా ఉమ్మడి జిల్లాలోని చాలా గ్రామాల్లో తాగునీటికి తిరిగి భూగర్భజలాలపైనే ఆధారపడటంతో భవిష్యత్తులో పరిస్థితి ఆందోళనకరంగా మారే అవకాశం ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకుంటేనే ప్రయోజనం ఉంటుందన్న వాదన వ్యక్తమవుతోంది. ఈ అధ్యయన నివేదికను శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు ఎస్ఎల్‌బీసీ సమీక్ష సందర్భంగా మంత్రులకు నివేదించారు.

23 మండలాల్లో ఆందోళనకరం

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని 73 మండలాలకు గానూ 23 మండలాల్లో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నార్కట్‌పల్లి, మర్రిగూడ మండలాల్లోని చాలా ప్రాంతాల్లో 5 పీపీఎం కంటే ఎక్కువగా.. చింతపల్లి, చందూరు, మునుగోడు, నారాయణపూర్, చిట్యాల, కట్టంగూరు, కేతేపల్లి, కనగల్, డిండి, దేవరకొండ, నాంపల్లి, గుర్రంపోడు, చందూరు, నల్గొండ, తిప్పర్తి, చౌటుప్పల్, వలిగొండ, బీబీనగర్, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు మండలాల్లోని భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ 5 పీపీఎం నుంచి 2 పీపీఎం వరకు ఉన్నట్లు తేలింది.

అవగాహన కార్యక్రమాలు అత్యవసరం

ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు బోరు, బావుల వంటి భూగర్భజలాలపై ఆధారపడకుండా కృష్ణా నీటి పథకాల ద్వారానే దాహార్తిని తీర్చుకునేలా అధికార యంత్రాంగాలు మరింత సన్నద్ధంగా కృషి చేయాల్సి ఉంది.ప్రజలు భూగర్భజలాలు తాగితే ఎలా ఫ్లోరైడ్ సోకుతుందో చెప్పడంతో పాటూ కేవలం ఉపరితల నీటినే ఉపయోగించడం ద్వారా.. ఉదాహర ఇకు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోని నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయడం ద్వారానే ఫ్లోరైడ్‌ను తగ్గించడానికి వీలువుతు ందని నిపుణులతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పించాల్సి ఉంది.ఇంకుడుగుంతలు, విచ్చలవిడి బోర్ల వాడకం నియంత్రణ, చెక్‌డ్యా ంల నిర్మాణం లాంటిపై యంత్రాంగం, ప్రభుత్వాలు దృష్టి సారించాలని కేంద్రీయ భూగర్భజల మండలి సైతం ఇటీవలే పలు సూచనలు చేస్తోంది.

## కాలుష్య కాసారం

బీబీనగర్ : బీబీనగర్ మండలంలోని పలు రసాయన, ఔషధ పరిశ్రములు కాలుష్య కారక వ్యర్థజలాలను విచ్చల విడిగా వదులుతుండటంతో హానికారక జలాలు మురుగునీటి కాల్వల ద్వారా చెరువులలో చేరి ఏటా లక్షల రూపాయలు విలువచేసే మత్స్య సంపద మృత్యువాత పడుతోంది.బీబీనగర్‌లోని వ్యర్థజలాలు మురుగునీటి కాల్వల ద్వారా పక్కనే ఉన్న రహీంఖాన్‌గూడలోని లింగమయ్యకుంటకు చేరుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బీబీనగర్ శివారులోని కాలుష్యకారక పరిశ్రమల నుంచి వదిలిన రసాయన జలాలు మురుగునీటి కాల్వల



ద్వారా లింగమయ్యకుంటకు చేరాయి. కుంటలోని చేపలు కుప్పలు తెప్పలుగా చనిపోయాయి. రూ.లక్షలు విలువ చేసే చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.
వర్షం పడితే చాలు...మారబోయిన బస్వయ్య, మత్స్యకారుడు, రహీంఖాన్‌గూడ ఔషధ పరిశ్రమలలో వెలువడే రసాయన వ్యర్థ జలాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుభ్రపరచాలి. దానికి ఖర్చవుతుందని బీబీనగర్‌లోని రసాయన పరిశ్రమల ప్రతినిధులు వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా బయటకు పంపుతున్నామని చెప్పి వర్షం పడితే చాలు వాటిని మురుగు నీటి కాల్వల్లో విచ్చలవిడిగా వదులుతున్నారు. ఆ నీరు చెరువుకు చేరి చేపలు చనిపోతున్నాయి. సంబంధిత అధికారులు చెరువు నీటిని పరిశీలించి సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి.
పరిశీలించి చర్యలు తీసుకుంటాం..సంగీత, పీసీబీ ఈఈ, ఉమ్మడి నల్లగొండ జిల్లాపరిశ్రమలో లోపాలుంటే సవరింపజేశాం. వ్యర్థ జలాలు బయటకు వదులుతున్నట్లు మాకు ఎలాంటి సమాచారం రాలేదు. ప్రస్తుత సమాచారంతో రహీంఖాన్‌గూడ వెళ్లి చెరువు నీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపిస్తాం. సదరు జలాల్లో కాలుష్యకారక వ్యర్థాలని తేలితే తప్పక చర్యలు తీసుకుంటాం.

## మరమగ్గాలెన్ని? ఉత్పత్తి సామర్థ్యమెంత?



సిరిసిల్ల : బతుకమ్మ చీరల స్థానంలో స్వయం సహాయక సంఘాలకు ఏటా రెండు చీరల పంపిణీకి ప్రభుత్వం ప్రణాళిక చేసింది. వీటి ఉత్పత్తులు రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్న సిరిసిల్లలోనే జరగనున్నాయి. దీనికోసం మూడు రోజులుగా చేనేత, జౌళి శాఖలోని సీఎఫ్ (సామాజిక కార్యకర్త)లు జిల్లా వ్యాప్తంగా ఉన్న మరమగ్గాలపై ప్రస్తుతం ఎలాంటి ఉత్పత్తులు జరుగుతున్నాయి. వాటి సాంకేతిక పరిజ్ఞానం, కార్మికుల నైపుణ్యాలతోపాటు పనుల్లేక మూసి ఉన్న కారా?నాలు, వాటిలోని మరమగ్గాలు అందులో పనిచేసే ఆసామి, కార్మికుల వివరాలను సేకరిస్తున్నారు. వీరు సేకరించే వివరాలతోపాటు మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్ల వారీగా ఎవరికి ఎంతమేరకు వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఇవ్వచ్చనేది తేలుతుంది. అప్పటికీ చీరల ఉత్పత్తులకు బడ్జెట్, నాణ్యత, రంగులు డిజైన్లపై స్పష్టత వచ్చాకే ఆర్డర్లు కేటాయింపు జరుగుతుంది.

మరమగ్గాలపైనే తయారీ బతుకమ్మ చీరలకు గత ప్రభుత్వం ఏడేళ్లలో రూ.2 వేల కోట్లకుపైగా నిధులు కేటాయించింది. ఉత్పత్తి, సేకరణ పూర్తిగా టెస్కో ఆధ్వర్యంలో జరిగింది. మహిళా సంఘాలకు ఇచ్చే చీరలను తొలుత చేనేత మగ్గాలపై నేసి ఇవ్వాలనుకున్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత మగ్గాల సామర్థ్యం సరిపోదనే నిర్ణయానికొచ్చారు. రాష్ట్రంలో 63.86 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులున్నారు. వీరికి ఏటా రెండేసి చీరలంటే 1,27,72,000 కోట్ల చీరలు కావాలి. ఒక్కో చీర సగటున ఆరు మీటర్ల చొప్పున 7.66 కోట్ల మీటర్లు ఉత్పత్తి చేయాలి. ఇంత పెద్దమొత్తంలో వస్త్రం ఉత్పత్తి చేయాలంటే మరమగ్గాలపైనే సాధ్యమవుతుంది. అయితే చేనేతలకూ కొంతమేరకు ఆర్డర్లు ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నారు.
నాణ్యతపై దృష్టి బతుకమ్మ చీరలకు వాడిన నూలు, నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం మహిళా సభ్యులకిచ్చే చీరల్లో నాణ్యమైన నూలు, రంగులు, డిజైన్లపై దృష్టి సారించారు. దీనికి సిరిసిల్లలోని మరమగ్గాల యజమానులు, ఆసాముల నుంచి పలు రకాల డిజైన్లతో చీరలను ఉత్పత్తిచేసి తీసుకురావాలని రాష్ట్ర చేనేత, జౌళీశాఖ సూచించింది. పరిశ్రమ వర్గాలు వాటి ఉత్పత్తులపై దృష్టి సారించాయి. మహిళా సంఘాలు ఆ నమూనాలను పరిశీలించి, అవసరమైన సూచనలు కూడా చేస్తారు. అప్పుడే ఆర్డర్లు కేటాయింపులు.. ఆసాములు, కార్మికుల కూలీ తదితరాలపై స్పష్టత వస్తుంది. వీటన్నింటి తర్వాతే పథకం విధివిధానాలు ప్రకటిస్తారు. బతుకమ్మ చీరల ఆర్డర్లకు సగటున ఎనిమిది నెలల సమయం పట్టింది. ఈ సారి మహిళా సంఘం సభ్యులకు చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించడంతో గ్రామీణాభివృద్ధి శాఖ వివరాలు సేకరించే పనిలో పడింది. జిల్లాల వారీగా ఉన్న మహిళా సంఘాలు ఎన్ని? అందులోని సభ్యులు ఎంత మంది? అని వివరాలు సేకరిస్తున్నారు.

## అమ్మలేం.. నడపలేం



సిరిసిల్ల : జిల్లా వస్త్ర పరిశ్రమకు విద్యుత్తు బిల్లులు గుదిబండగా మారాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని వస్త్ర పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు విద్యుత్తు యూనిట్లకు రాయితీ, బిల్లుల్లో తగ్గింపులు ఇస్తున్నాయి. జిల్లాలో మాత్రం కుటీర పరిశ్రమగా ఉన్న మరమగ్గాలకు నాలుగో కేటగిరీలో యాభై శాతం రాయితీ ఉంది. మిగతా ఎస్ఎస్ఐ యూనిట్లకు, టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు మాత్రం ఎలాంటి రాయితీ లేదు. గత ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్కుకు పలు విడతల్లో విద్యుత్తు రీయింబర్స్‌మెంటును విడుదల చేసింది. సిరిసిల్లలోని ఎస్ఎస్ఐ యూనిట్లకు ఇప్పటికీ రూ.20 కోట్లపైన బకాయిలు ఉన్నాయి. ఈ బిల్లులు చెల్లించలేక మూసివేశారు. మరికొంత మంది సందిగ్ధంలో ఉన్నారు. జిల్లా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న విద్యుత్తు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఈఆర్‌సీకి లేఖ రాశారు. ఇక ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం నేతన్నలు ఎదురుచూస్తున్నారు.
జిల్లాలో మరమగ్గాల వస్త్రోత్పత్తితో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. కుటీర పరిశ్రమలుగా ఉన్న వాటికి మాత్రమే ప్రభుత్వం యాభై శాతం రాయితీ వర్తిస్తుంది. అది కూడా పది హెచ్‌పీల వరకే పరిమితి.
జిల్లాలో 2018 తర్వాత మరమగ్గాల సంఖ్య పెరిగింది. వీటిలో ఎక్కువగా ఎస్ఎస్ఐ యూనిట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం పది హెచ్‌పీ నుంచి ఇరవై హెచ్‌పీలకు పెరిగింది. ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నవారు ప్రభుత్వ ఆర్డర్లకు చేనేత, జౌళిశాఖకు ఎస్ఎస్ఐ యూనిట్లుగా పేర్కొన్నారు. దీంతో వీరి విద్యుత్తు వినియోగం, ప్రభుత్వ రాయితీలపై సెస్ విచారణ చేసింది. ఎస్ఎస్ఐ యూనిట్లకు ప్రభుత్వ రాయితీ వర్తించదని చేనేత, జౌళిశాఖ తేల్చి చెప్పింది. దీంతో ఈ ఎస్ఎస్ఐ యూనిట్లన్నీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని మూతపడ్డాయి.
తమిళనాడులోని మరమగ్గాలకు ఉచిత విద్యుత్తును 750 నుంచి వెయ్యి యూనిట్లకు అక్కడి ప్రభుత్వం పెంచింది. 1,500 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.4.15, ఆపైన అయితే రూ.5.30 చేశారు. కర్ణాటకలో పది హెచ్‌పీల నుంచి 20 హెచ్‌పీలకు సామర్థ్యం పెంచారు. దీనిలో యూనిట్‌కు పరిశ్రమ వర్గాలు రూ.1.25 చెల్లించాలి. మహారాష్ట్రలో మరమగ్గాలకు యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లించాలి.
ప్రభుత్వం ప్రతిసారి రీయింబర్స్‌మెంటు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. పెరుగుతున్న విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు మరో ప్రత్యామ్నాయం సౌర విద్యుత్తు వాడకం. టెక్స్‌టైల్ పార్కులోని 112 యూనిట్లలో ఏడు యూనిట్లు సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్కో పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి 50–75 కిలోవాట్లతో యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. 75 కిలోవాట్లు సామర్థ్యం ఉన్న యూనిట్కు రోజుకు 300 కిలోవాట్ల విద్యుత్పత్తి అవుతుంది. సగటున 50 కిలోవాట్ల సామర్థ్యానికి రూ.17–20 లక్షల వరకు ఖర్చువుతుంది. తర్వాత వీటి ఏర్పాటు ఖర్చులు పెరగడంతో యజమానులు వెనక్కి తగ్గారు.
రాయితీ కల్పించాలి– చిలుక అనిల్, ఆసామి

## మహిళా సంఘాలకు సాంకేతిక దన్ను



గజ్వేల్ : మహిళా సాధికారతలో భాగంగా ప్రభుత్వం సహాయక సంఘాలకు సాయం అందిస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరి చేస్తున్నారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.50 వేలు ఇవ్వగా ప్రస్తుతం ఎలాంటి తనఖా లేకుండా గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు మంజూరు చేస్తున్నారు. 98శాతం సంఘాలు సకాలంలో వాయిదాలు చెల్లిస్తున్నాయి. దీంతో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు పోటీ పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల మహిళల్లో ఎక్కువ మంది నిరక్ష్యరాసులు ఉన్నారు. దీంతో నిధులు దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా సంఘాల లావాదేవీలను పూర్తిగా కంప్యూటరీకరించారు. అంతర్జాల నివేదికల ఆధారంగా మహిళా సంఘాలకు గ్రేడింగులు ఇస్తున్నారు. వీవో అకౌంటింగ్ యాప్ అందుబాటులోకి రావడంతో సంఘాల్లో మరింత పారదర్శకత పెరిగింది.

రుణాల గ్రేడింగ్ ప్రామాణికం

బ్యాంకు, శ్రీనిధి రుణాల మంజూరు సమయంలోనే మహిళా సంఘాల సభ్యులు ఒక చోటికి చేరేవారు. సమావేశాలు నిర్వహించకపోయినా నిర్వహిస్తున్నట్లు దస్త్రాల్లో సంతకాలతోనే సరిపెట్టేవారు. యాప్ అందుబాటులోకి రావడంతో సమావేశాలు సక్రమంగా నిర్వహించిన సంఘాలకు బ్యాంకు రుణాలన్నారు. శ్రీనిధి రుణాలకు సైతం ఇదే వర్తిస్తుంది. ప్రతి నెల సమావేశం నిర్వహించి ఫోటోలు యాప్‌లో అప్‌లోడ్ చేసిన సంఘాలకే రుణాల కోసం ఐకేసీ సిబ్బంది బ్యాంక్ అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. మహిళా సంఘాల పనితీరు ఆధారంగా ఇచ్చే గ్రేడింగ్ కూడా దీనినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

గ్రామైక్య సంఘాల పనితీరు ఇలా..

గ్రామైక్య సంఘాల పరిధిలోని పొదుపు సంఘాలు రుణాల వసూళ్ల తీరుపై చర్చిస్తాయి. ఇంకా చెల్లించాల్సింది ఎంత అని పరిశీలిస్తారు. ఏదైనా సంఘంలో సభ్యులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే శ్రీనిధి రుణం ఇచ్చేందుకు తీర్మానిస్తారు. సామాజిక అంశాలు పైన చర్చ ఉంటుంది. బాల్య వివాహాల నిరోధం, వరకట్నం వేధింపులు, మహిళలు, చిన్నారులపై హింస తదితర అంశాలపై చర్చించడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తారు.

సమగ్ర సమాచారం...

గ్రామైక్య సంఘం అకౌంటింగ్ యాప్‌లో వివరాలు పక్కాగా నమోదు చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి సంఘానికి సంబంధించి ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరు వరకు ఉన్న లావాదేవీల ఆధారంగా ఆస్తి అప్పుల పట్టికను రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న జమ, చెల్లింపుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. సంఘాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రతినెలా సమావేశాన్ని నిర్వహించడంతో వీటికి సంబంధించిన చిత్రాలన్నీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

జిల్లా వివరాలు
మండలాలు: 23
గ్రామైక్య సంఘాలు: 726 మహిళా స్వయం సహాయక సంఘాలు: 18,261 సభ్యులు : 1,93,508

## బీపీ పెరుగుతోంది..!

మిర్యాలగూడ : బీపీ, షుగర్‌లను నియంత్రించాలంటే ప్రధానంగా ఆహర అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. సాయంత్రం ఏడు గంటలలోపే రాత్రి భోజనం ముగించాలి. ఆహారంలో పిండి పదార్థాలు తక్కువగా ఉండి.. పీచు, ప్రొటీన్లు అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.మారిన ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మధుమేహం, రక్తపోటు వేగంగా విస్తరిస్తోంది. గతంలో వీధికొక్కరో.. ఊరికిద్దరో ఉండే ఈ వ్యాధిగ్రస్థులు ప్రస్తుతం కనీసం ఇంటికొకరుగా పెరిగారు. కరోనా అనంతరం మరింతగా వ్యాధులు ప్రబలినట్లు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా యువత సైతం చెడు వ్యసనాలు, ప్రణాళిక లేని ఆహార నియమాలతో ఆయా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం బీపీ, షుగర్ వ్యాధులబారిన పడుతున్న వారిలో యువత సైతం అధిక సంఖ్యలో ఉండడం ఆందోళన కలిగించే విషయం.
యువతలో పెరుగుతున్న బాధితులు..గత ఐదేళ్ల కాలంలో బీపీ, షుగర్ బారిన పడుతున్న వారిలో యువత సంఖ్య భారీగా పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మొత్తం బాధితుల్లో సుమారు 40 శాతం మంది వరకు యువతే ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోని యువత అధికంగా మధుమేహం, రక్తపోటు బారిన పడుతున్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం రక్తపోటు, మధుమేహ బాధితులు 3,70,675 మంది ఉండగా.. వీరిలో 40 ఏళ్ల లోపు వారు సుమారు లక్షన్నర పైగా ఉన్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు.



ఆహార అలవాట్లు మార్చుకోవాలి..డాక్టర్ అల్లుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడు, మిర్యాలగూడఉమ్మడి జిల్లాలో ఇలా...ఉమ్మడి జిల్లాలో మొత్తం రక్త పోటు బాధితులు 2,37,311 మంది ఉండగా.. మధుమేహ బాధితులు 1,33,364 మంది ఉన్నారు. రక్తపోటు, మధుమేహం రెండింటి బారినపడిన వారు 86,354 మంది ఉన్నారు. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 2,02,202 మంది రక్తపోటు, మధుమేహం బారిన పడిన వారు ఉండగా.. వీరిలో రెండు వ్యాధుల బారినపడిన వారు 46,500 మంది ఉన్నారు.
సూర్యాపేట జిల్లాలో రెండు వ్యాధుల బారినపడిన 90,004 మంది.. యాదాద్రి లో 78,469 మంది ఉన్నారు.యువతలో మధుమేహం, రక్తపోటు వ్యాధుల విస్తరణపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందితో చేసిన సర్వే వివరాలు ఇవీ..మీ కుటుంబ సభ్యులు, బంధువుల్లో 40 ఏళ్లలోపు బీపీ, షుగర్ బారిన పడిన వారున్నారా?బీపీ, షుగర్‌ను నియంత్రించడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నారా?
ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

## ప్రభుత్వ భూముల్లో వెంచర్లు

ఆసిఫాబాద్ : ప్రభుత్వ భూములని నిర్ధారించిన రెవెన్యూ అధికారులే మళ్లీ వాటికి నాలా అనుమతులు జారీ చేసి, రిజిస్ట్రేషన్ చేయడం అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తోంది. అనుమతులు లేకుండానే పంట చేలను ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కాలువలను ఆనుకునే నిబంధనలకు విరుద్ధంగా, యథేచ్ఛగా భూములను అమ్మేస్తున్నారు. పైసా పైసా జమచేసి, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, కొందరు అప్పులు చేసి మరీ అవగాహన లేక ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాలను కొనుగోలు చేసి నిండా మునుగుతున్నారు.
అన్ని మండలాలకు సంబంధించిన ప్రభుత్వ, నిషేధిత భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇస్తారు. రిజిస్ట్రార్లు, ఈ భూములపై ఎవరికి యాజమాన్య హక్కులు కల్పించరా దు. జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. ఇందులో రూ.లక్షల్లో డబ్బు చేతులు మారుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. పట్టా ఉన్న వ్యవసాయ భూములకు మాత్రమే వ్యవసాయేతర భూములు గా మార్చడానికి నాలా అనుమతులు ఇవ్వాల్సిన తహసీల్దార్లు, ప్రభుత్వ అసైన్డ్ భూములకు సైతం ఈ అనుమతులు ఇచ్చేస్తున్నారు. వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి.
రహదారి పక్కనే...రెబ్బెన మండలంలో సర్వే నంబర్ 36 (ఖరీజ్ ఖాతా)లో 19.92 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 14.25 ఎకరాలను రైతులకు అసైన్ చేశారు. మరో 5.67 ఎకరాలు ఇందిరానగర్ గ్రామం కోసం కేటాయించారు. ఉపరితల బొగ్గు గని ఏర్పాటులో భాగంగా ముంపునకు గురైన ప్రజలకు ఇందిరానగర్ సమీపంలో పునరావాసం కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆనుకుని సర్వే నంబర్ 36లో 5 ఎకరాలను అబీబిన్ అమర్‌కు అసైన్ చేశారు. ప్రస్తుతం ఈ అసైన్ భూమిలోనే వెంచర్ వేశారు. నాలుగు వరుసల రహదారి పక్కనే మూడు



గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు సైతం జరిగాయి. ఆసిఫాబాద్ పట్టణంలో ఓ ఉద్యోగి చిర్రకుంట వెళ్లే మార్గంలో ప్లాట్లు కొనుగోలు చేయడానికి రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇచ్చిన అనంతరం ప్రభుత్వ భూమని తెలియడంతో ఆ డబ్బులు తిరిగి తీసుకున్నారు.
నమ్మిస్తూ.. ప్లాట్లు అంటగడుతూ..కాగజ్‌నగర్ మండలం బోరిగాం శివారు ప్రాంతంలో కొండపై పూర్తిగా ఉన్న అసైన్డ్ భూములకు సైతం రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ప్రభుత్వ భూములు ప్లాట్లుగా రూపాంతరం చెందుతున్నా, స్థానిక అధికారులు అటువైపు చూడటం లేదు. ఈస్‌గాం, నజ్రుల్‌నగర్ ప్రాంతాలు పూర్తిగా ఏజెన్సీ. ఇక్కడ ఎలాంటి వెంచర్లు వేయరాదు. పలుకుబడి ఉన్న నేతలు కొందరు ఇదే వ్యాపారంగా మలుచుకుని, ఇక్కడ సైతం ప్లాట్ల విక్రయాలకు తెరతీశారు. ఏకంగా బోర్డులు పాతి మరీ విక్రయిస్తున్నా రు. ఆసిఫాబాద్ పట్టణంలో బీడీపీపీ భూముల్లో భారీ భవనాలు నిర్మించడం పరిపాటిగా మారింది. డీటీసీపీ అనుమతులు ఉన్నాయని చెబుతూ అమాయకులను నమ్మిస్తూ ప్లాట్లను అంటగడుతున్నారు.

# అనాథలకు పెద్దదిక్కు..

కొడంగల్ : ప్రస్తుతం ఎంతో మంది తమ అమ్మానాన్నలను వృద్ధాప్యంతో అనాథ శరణాలయాల్లో వదిలేస్తున్న విషయం మనకు తెలిసిందే. ఇంకొందరు అనాథలుగా వదిలేస్తున్నారు. అలాంటి వారికి అండగా నిలుస్తున్నారీ యువకులు. అభాగ్యులకు పెద్ద దిక్కుగా మారుతున్నారు. చిన్న వయసులోనే పెద్దల భారం మోస్తూ ప్రశంసలు పొందుతుండటం విశేషం. వారే వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు.

సేవ చేయాలన్న ఆలోచనతో..కొడంగల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ పేదలకు ఏదైనా సాయం చేయాలన్నది ఆయన ఆలోచన. తన తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ కష్టపడ్డ తీరు అతడిని కదిలించింది. అందుకే వృద్ధాప్యంలో ఉన్న వారికి, అనాథలకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అలా తొలి అడుగేశారు. తన ఆలోచనను మిత్రులతో పంచుకోగా.. వారు సైతం సై అనడంతో అమ్మానాన్న ఫౌండేషన్ రెండేళ్ల కిందట ఊపిరి పోసుకుంది. అప్పటి నుంచి బృందంగా ఫౌండేషన్ పేరిట సేవలు చేయడం ప్రారంభించారు.

అన్నీ తామై..మతిస్థిమితం లేని వారెవరైనా కనిపిస్తే వెంటనే వారి చేరదీస్తారు. స్నానం చేయించి కొత్త దుస్తులు అందిస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారా ఆరా తీసి సొంత వారికి అప్పగిస్తున్నారు.



ఒకవేళ ఎవరూ లేకపోతే ఏదైనా అనాథ శరణాలయంలో చేర్పిస్తున్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు పెద్ద దిక్కుగా నిలిచి అన్నీ తామై చూసుకుంటున్నారు. అలాంటి వారికి చదువు చెప్పిస్తున్నారు. నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. దాతల సాయంతో పండగలు, ఇతర ప్రత్యేక సందర్భాలలో కొత్త దుస్తులు ఇప్పిస్తున్నారు.

అనాథ పిల్లలకు ఉన్నత చదువు చదివించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. వారి విషయాన్ని దాతల దృష్టికి తీసుకెళ్లి సహకారం అందించేలా ప్రోత్సహిస్తున్నారు. ఫౌండేషన్ సభ్యులే స్వచ్ఛందంగా డబ్బు జమ చేసుకుంటూ పేదలకు సేవ చేస్తున్నారు. ఒక్క విద్య విషయంలోనే దాతల సహకారం తీసుకుంటున్నారు. బధిరులకు ప్రతి నెలా కొంత మొత్తం ఇస్తున్నారు.మా కుటుంబం కష్టాన్ని చూసి..: మా కుటుంబం పడ్డ కష్టం ఇంకెకవరూ పడకూడదని సేవాకార్యక్రమాలు మొదలుపెట్టాం. ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ముందుకు సాగుతున్నాం. మాకు వీలైనంత మేర తల్లిదండ్రులు కోల్పోయిన వారికి చేయూత అందిస్తున్నాం. ఉన్నత విద్య అభ్యసించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం. ప్రవీణ్‌కుమార్

# అద్దె గదుల్లో.. అరకొర వసతులు

సంగారెడ్డి : సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో గర్భిణులు, బాలింతలు, అయిదేళ్లలోపు బాలలకు భరోసా కల్పిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు.. తల్లీబిడ్డల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. పోషకాహారం పంపిణీ చేస్తున్నారు. ఇంతటి కీలకమయిన కేంద్రాలకు చాలా చోట్ల సొంత భవనాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పక్కా భవనాలు మంజూరైనప్పటికీ.. ఎక్కడా పనులు చేపట్టలేదు.

ఐదు పర్యవేక్షణ కేంద్రాలు

జిల్లాలో జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, సదాశివపేట, పటాన్‌చెరులో ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి సూపర్‌వైజర్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కొనసాగుతోంది. పౌష్టికాహార లోపమున్న పిల్లలను గుర్తించి పోషకాహారం అందేలా కృషి చేస్తున్నారు. బాలలకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిస్థితి..సదాశివపేట ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలో 240 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 55 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతావి అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. వసతులు లేకపోవడంతో మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.అందోలు–జోగిపేట పురపాలికతో పాటు మండలంలో 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటలో సొంత భవనాలున్నవి 34 మాత్రమే. రేకుల షెడ్లు, పెంకుటిళ్లలో నిర్వహిస్తున్నారు.

కంది మండలంలో 30 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. చాలా చోట్ల అద్దె గదుల్లోనే నిర్వహిస్తున్నారు. తున్కిల్లతండాల్లో సొంత భవనం లేక పోవడంతో తాత్కాలికంగా గ్రంథాలయ భవనంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పట్టణ ప్రాంతాల్లో అద్దె భవనాలకు గరిష్ఠంగా నెలకు రూ.4500, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.1000 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇంత తక్కువ అద్దెకు ఇళ్లు ఇవ్వడానికి యజమానులు ముందుకు రావడం లేదు. దీంతో ఇరుకిరుకు గదుల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సౌకర్యం, శౌచాలయాలు లేకపోవడంతో బాలలు, గర్భిణులు, బాలింతలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మంజూరైన భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తే సమస్య కొంతమేరకైనా పరిష్కారం అవుతుంది.సమస్యలు అధిగమించేందుకు కృషి చేస్తాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను అధిగమిస్తాం. అద్దె భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు భవనాలు మంజూరయ్యాయి. వాటికి నిధులు లేక పనులు నిలిచాయి. నిధులు మంజూరు చేస్తే వినియోగంలోకి వస్తాయి. అసంపూర్తి పనులను పూర్తి చేసేలా క్షేత్ర స్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటాం.

లలితకుమారి, జిల్లా మహిళా సంక్షేమాధికారిణి

# మహానగరం దిశగా అడుగులు



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా దిశగా అడుగులు పడుతున్నాయి. మరో నాలుగు నెలల్లో ప్రస్తుతమున్న పాలకవర్గ గడువు ముగుస్తుండగా.. తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని నెలలు ప్రత్యేకాధికారి పాలన ఏర్పాటు చేసే అవకాశముండటంతో ఆ లోపు సమీపంలోని గ్రామాలను విలీనం చేసి డివిజన్ల సంఖ్య పెంచడంతోపాటు పునర్విభజన చేయాలనే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీప గ్రామాలతోపాటు కొత్తపల్లి పురపాలికను విలీనం చేసేందుకు పురపాలక శాఖకు ప్రతిపాదనలు పంపించాలని శనివారం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. మరో వైపు గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చకచకా జరుగుతుండటంతో మళ్లీ విలీన ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది.

ఆరేళ్ల కిందట ఎనిమిది గ్రామాలు

1987లో రాంనగర్, రాంపూర్ పంచాయతీలను విలీనం చేశారు. ఆ తర్వాత 2018లో ఎనిమిది గ్రామాలను విలీనం చేశారు. 50 డివిజన్లను 60 డివిజన్లకు పెంచారు. అలుగునూర్, సదాశివపల్లి, పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వలంపహాడ్ కాలనీలుగా ఏర్పడ్డాయి. గతంలో కంటే కొంతమేర రహదారులు, మురుగుకాలువలు, వీధిదీపాలు వంటి సౌకర్యాలు మెరుగుపడటం, భూముల విలువ పెరిగింది. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుండగా కొత్తగా గ్రామాలు కలపాలని నిర్ణయించారు.

మొదలైన ప్రయత్నాలు?

రాష్ట్రంలో మహానగరపాలక సంస్థ హైదరాబాద్ కాకుండా వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ ఒక్కటే ఉంది. కరీంనగర్ చుట్టూ ఉన్న గ్రామాలను విలీనం చేస్తే జనాభా, విస్తీర్ణం పెరిగే అవకాశముంది. దాని ఆధారంగా గ్రేటర్ చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పురపాలిక నుంచి నగరపాలక సంస్థగా హోదా కల్పించారు. మళ్లీ హోదా పెంచితే ఎలా ఉంటుందనే ఆలోచనలో పడినట్లుగా ప్రచారం జరుగుతోంది. మరో వైపు కొత్తపల్లి పురపాలికను ఏర్పాటు చేసినా జనాభా, ఇళ్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఆదాయ మార్గాలు కూడా తక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేయడంలో కాని, అధికారులను నియమించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ డిప్యుటేషన్‌పై అధికారులను నియమిస్తున్నారు. కరీంనగర్‌లోకి ఏడు ప్రాంతాలు నగరపాలక సంస్థ పరిధిలోకి కరీంనగర్ రూరల్ మండలంలోని మూడు గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని మూడు గ్రామాలు, కొత్తపల్లి పురపాలికను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేయనున్నారు. నగరానికి పది కిలోమీటర్ల దూరంలో ఇవి ఉన్నాయి. పట్టణీకరణతోపాటు ప్రజలకు కనీస సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఇందులో బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్, కొత్తపల్లి పురపాలికను కలుపుతూ ప్రతిపాదనలు పంపించాలని మంత్రి లేఖలో వివరించారు. గతంలోనే బొమ్మకల్, చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను విలీనం చేస్తారని భావించినా రాజకీయ ఒత్తిళ్లతో ఆ ప్రతిపాదనలు అటకెక్కించారు. మళ్లీ ఈ ప్రక్రియ తెరపైకి రావడంతో ఆయా గ్రామాల్లో విలీన అంశం చర్చకు దారి తీసినట్లయింది.

# కమిషనర్లు వస్తున్నారు.. వెళ్తున్నారు



గోదావరిఖని: రామగుండం నగరపాలక కమిషనర్‌గా పని చేసేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత మూడేళ్లలో నలుగురు కమిషనర్‌లు మారడమే దీనికి నిదర్శనం. ఒకరిద్దరు మాత్రమే రెండేళ్లకు మించి పని చేయగా.. ఎక్కువగా ఆరేడు నెలల్లోనే బదిలీలు చేయించుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఉన్నారు. నగరపాలక కమిషనర్‌గా పనిచేసిన తొలి ఐఏఎస్ అధికారి ఉదయ్‌కుమార్ ఏడాదిన్నర కాలం.. అనంతరం నలుగురు కమిషనర్లు ఆరేడు నెలలు మాత్రమే ఉండటం గమనార్హం. వీరిలో పెద్దపల్లి ఆర్డీవోగా పనిచేసిన శంకర్‌కుమార్ రామగుండం నగరపాలక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమారు మూడు నెలల్లోనే అనిశా అధికారులకు పట్టుబడ్డారు. ఆయన తర్వాత బి.సుమన్‌రావు, సీహెచ్.నాగేశ్వర్, సీహెచ్.శ్రీకాంత్ వరుసగా వచ్చారు. సుమన్‌రావు సుమారు ఏడాదిన్నర పాటు పని చేయగా, నాగేశ్వర్ ఆరు నెలల్లో హైదరాబాద్‌కు బదిలీ అయ్యార%ళి%. 2024 ఫిబ్రవరి 16 నుంచి బాధ్యతలు స్వీకరించిన ప్రస్తుత కమిషనర్ శ్రీకాంత్ ఈ నెల 19న సెలవుపై వెళ్లారు. మొదట నగరపాలక ఎస్ఈకి.. అనంతరం ఒక్క రోజు వ్యవధిలోనే జిల్లా అదనపు కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు అప్పగించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుత కమిషనర్ బదిలీకి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తన అధికారిక సిమ్‌ను సైతం కార్యాలయంలో అప్పగించి వెళ్లారని సమాచారం.

గతంలోనూ అంతే

గతంలోనూ ఆరు నెలలకో కమిషనర్ మారిన సంఘటనలున్నాయి. 2010లో డాక్టర్ సత్యనారాయణ అయిదు నెలలు, 2011లో షాహిద్ మసూద్ ఆరు నెలలు మాత్రమే పనిచేశారు. నగరపాలక కమిషనర్‌గా పని చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 2010 అక్టోబరు నుంచి 2011 జులై వరకు ఇంజినీరింగ్ అధికారులు ఇద్దరు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. నగరపాలక నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఇక్కడ పని చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదనే విమర్శలున్నాయి. పాలకవర్గం గడువు మరో నాలుగు నెలల్లో ముగియనుండడంతో పాటు వివిధ రకాల నిధులతో రామగుండంలో అభివృద్ధి పనులు మొదలైన నేపథ్యంలో పూర్తి స్థాయి కమిషనర్ ఉండాల్సిన అవసరం ఉంది.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా అదనపు కలెక్టర్‌గోదావరిఖని పట్టణం, రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీని శనివారం నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీహర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 24 వరకు నగరపాలక కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సెలవులో వెళ్లగా ఇన్‌ఛార్జి కమిషనర్‌గా శుక్రవారం నగరపాలక ఎస్ఈ శివానంద్‌కు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే కమిషనర్ బదిలీకి ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో రామగుండం నగరపాలక పూర్తి బాధ్యతలను అదనపు పాలనాధికారి అరుణశ్రీకి అప్పగించారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలపై నిర్లక్ష్యమేల?

ప్రస్తుత వర్షాకాలంలో ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణల్లో పిచ్చిమొక్కలు, పనికిరాని గడ్డి పెరిగింది. వసతుల లేమి, ఇతర సమస్యలతో విద్యార్థులు భయం నీడన చదువులను నెట్టుకొస్తున్నారు. చెత్తాచెదారంతో విష పురుగులు సంచరించి విద్యార్థులకు హాని తలపెట్టే ప్రమాదం పొంచి ఉంది. ఇల్లంతకుంట మండలం గాలిపల్లి బీసీ సంక్షేమ వసతిగృహంలో రమావత్ రోహిత్ అనే విద్యార్థి పాముకాటుకు గురై ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా విద్యాసంస్థల్లోని సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యల సుడిలో వసతిగృహం

రాచర్ల గొల్లపల్లిలోని బీసీ బాలుర వసతిగృహం ఇది. ప్రస్తుతం 55 మంది విద్యార్థులున్నారు. గదుల కిటికీలకు అమర్చిన దోమతెరలు చిరిగిపోయాయి. కొన్ని చోట్ల తలుపులు ఊడిపోయాయి. శుద్ధజల పరికరం పని చేయడం లేదు. ప్రహరీ వెలుపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వసతిగృహం చుట్టూ గడ్డి నివారణ మందును పిచికారీ చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీలో 223 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. భవన సముదాయంలోనూ గడ్డి, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించాల్సి ఉంది.

గదుల్లోకి కోతులు వీర్నపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో 315 మంది విద్యార్థినులున్నారు. ఆదర్శ పాఠశాల వసతి గృహంలో వంద మందికి అనుకూలంగా ఉన్నప్పటికీ 47 మంది మాత్రమే చేరారు. కోతులు



గదుల్లోకి వస్తూ బాలికలను భయపెడుతున్నాయి. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు, తినుబండారాలను ఎత్తుకుపోతున్నాయి. ఆయా వసతిగృహాల ఆవరణల్లో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.

పేరుకుపోయిన చెత్తాచెదారంకోనరావుపేటలో గిరిజన ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ పరిస్థితి ఇది. ఇక్కడ 3 నుంచి 9వ తరగతి వరకు 88 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వంట గది, భోజనశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మురుగుదొడ్ల తలుపులు మరమ్మతుకు గురికావడంతోపాటు ఇక్కడి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడం ఆందోళన కలిగించే సమస్య అని విద్యార్థులు వాపోతున్నారు.

# నాణ్యత ప్రశ్నార్థకం!

పెద్దపల్లి :మానేరు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా.. రెండు జిల్లాలను కలిపేలా నిర్మిస్తున్న వంతెన గడ్డర్లు వరుసగా కూలిపోతుండటం విస్మయం కలిగిస్తోంది.. పనులు నాణ్యంగా జరిగాయా.. నిబంధనల ప్రకారం పనులు చేశారా.. అధికారులు సరిగా పర్యవేక్షణ చేశారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి..

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం, ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ 2016 ఆగస్టు 4వ తేదీన రూ.47.40 కోట్ల అంచనాతో కిలోమీటర్ దూరం వంతెన నిర్మాణానికి అప్పటి రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మిస్తున్న క్రమంలోనే భారీ వరదలకు నిర్మాణ సామగ్రి దెబ్బతినడంతో రెండేళ్ల క్రితం గుత్తేదారు పియర్లపై గడ్డర్లను అనుసంధానం చేసే క్రమంలో అవి కూలిపోకుండా ఉండేందుకు చెక్క ముక్కలను పెట్టారు. వాటిని పూర్తి స్థాయిలో బిగించలేదు. మానేరు వాగు రెండేళ్ల భారీ వరదలతో ఉద్ధృతంగా ప్రవహించడంతో సపోర్టుగా ఉన్న చెక్కముక్కలు ధ్వంసమయ్యాయి. దీంతో గిడ్డర్లు పట్టు తప్పాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న మూడు గడ్డర్లు కుప్పకూలాయి. అప్పుడు విచారణ జరిపిన అధికారులు చెక్కముక్కల ధ్వంసమవడంతోనే గడ్డర్లు కూలాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేదు. మరోసారి అయిదు గడ్డర్లు నేలకూలాయి. రెండు సందర్భాల్లోనూ గాలి దుమారం బాగా వచ్చినప్పుడే కుప్పకూలాయని ఓడేడు గ్రామస్థులు పేర్కొంటుండగా గాలి దుమారానికి గడ్డర్లు కుప్పకూలే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. వాస్తవానికి కాంక్రీట్ గడ్డర్లు చాలా బరువు కలిగి ఉంటాయి. వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇవి బలోపేతంగా ఉంటేనే సాధ్యమవుతుంది. అలాంటి గడ్డర్లు పేకమేడల్లా కూలిపోవడం గమనార్హం. డిజైనింగ్ సరిగా ఉందా.. నిర్మాణానికి ముందు భూమి



పరీక్ష చేశారా.. పనులు చేసే సమయంలో పర్యవేక్షణ సరిగా ఉందా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

కాంక్రీట్ బీమ్ సరిగా లేకే..ఒక్కో గడ్డరు 130 టన్నుల బరువుతో ఉంటుంది. కిలోమీటర్ వంతెన నిర్మాణానికి 120 గడ్డర్లు అవసరమయ్యాయి. ఇందులో 58 వంతెనకు అనుసంధానించగా మిగిలిన 62 ఇంకా బిగించలేదు. ఏప్రిల్ 22, జులై 2న కూలిన గడ్డర్లు మొదటగా అనుసంధానించిన 58 గడ్డర్లలోనివి. కాంక్రీట్ బీమ్‌లు సరిగా వేయకపోవడంతోనే కూలిపోయి ఉండవచ్చని భావిస్తున్నాం. మిగతా గడ్డర్లు కూడా నిర్మించిన వెంటనే అనుసంధించకుండా వదిలేశారు. ఇవి కూడా కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. గతంలో కూలిన గడ్డర్లకు గ్యాస్ వెల్డింగ్ వేసి వంతెనకు అనుసంధానించేందుకు ప్రయత్నించినా నిలవడం లేదు. ఈ పనులు చేసిన గుత్తేదారు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఆయన నుంచి జరిగిన నష్టం వసూలు చేస్తాం. మిగిలిన పనులు వేరే గుత్తేదారుకు అప్పగించి పనులు పూర్తి చేస్తాం. వంతెన పనులు పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.జాఫర్, డీఈ, ఆర్అండ్‌బీ

# ఉపకార వేతనాల సాధనలో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి :పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే విద్యను ఆపేయకుండా ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన అర్హత పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు దీనికి అర్హులు.. ఈ పరీక్షలో రాణించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తోంది. ఉమ్మడి జిల్లాలోనే రామగుండం లింగాపూర్‌లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం అత్యుత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ఉపకార వేతనం సాధించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

అర్హతలు... పరీక్ష విధానం

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించే ఉపకారవేతన పరీక్షకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.. వీరు ఏడో తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50, ఇతరులు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీనిని ఏటా నవంబరు మాసంలో నిర్వహిస్తారు. జిల్లా యూనిట్గా, కేటగిరీల వారీగా, ప్రతిభ కొలమానంగా అర్హులను ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏటా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాసేలా ప్రోత్సహిస్తున్నారు.

ఆదర్శ పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు

2022-2023 : 19

2021-2022 : 23

2023-2024 : 17

ఎంతో సంతోషంగా ఉంది

నేను రామగుండం మోడల్ పాఠశాలలో ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసి అత్యుత్తమ మార్కులు సాధించా. సీనియర్ల సలహాలు, సూచనలతో నిత్యం చదువుపై దృష్టి సారించా. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో నమూనా ప్రశ్నపత్రాలతో నిత్యం సాధన చేశా. నా కష్టానికి ఫలితం దక్కింది. ఉపకార వేతనం పొందేందుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

చిట్టోజు అన్విత, తొమ్మిదో తరగతి

ఉపాధ్యాయుల శిక్షణ బాగుంది

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించా. ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ ఇందుకు ఎంతగానో దోహదపడింది. ఉపాధ్యాయుల చొరవతో ఆన్‌లైన్ తరగతుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించా. అనుకున్న విధంగా మంచి ర్యాంకు సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యా. పాఠశాలలో ప్రత్యక్ష బోధనతో పాటు అంతర్జాలంలో కూడా ప్రతి అంశాన్ని వివరించారు.

ఎం.చక్రిక, తొమ్మిదో తరగతి

సమష్టి కృషితో...

ఈ విద్యా సంవత్సరం రామగుండం మోడల్ పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను రీజనింగ్, నెంబరు సిరీస్ ఇతర అంశాలపై నిత్యం సన్నద్ధం చేయించాము. సాంఘిక, సామాన్య, గణితంపై ఇతర ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చాము. ప్రతి ఏటా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపకార వేతనాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.ముత్యం రాజశేఖర్, ఆంగ్ల ఉపాధ్యాయులు

## కొత్త పంచాయతీలకు పచ్చజెండా

కోటగిరి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఆమోద ముద్రవేసింది. కోటగిరి ఉమ్మడి మండలంలో నూతనంగా ఎనిమిది పంచాయతీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి మండలంలో ఇప్పటి వరకు 28 పంచాయతీలు ఉండగా ఆ సంఖ్య 36కి చేరింది. 2018లో గత భారాస ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయినా మరికొన్ని అనుబంధ గ్రామాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటుకు డిమాండ్లు తెరపైకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో అనుబంధ గ్రామాల ప్రజల విజ్ఞప్తుల మేరకు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. నాటి ప్రతిపాదనలకు సర్కారు తాజాగా ఆమోదం తెలిపింది. పంచాయతీ ఎన్నికల ప్రకటన వెలువడటానికి ముందే ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. దీంతో ఆయా పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది.

**ఎన్నికల నిర్వహణకు కసరత్తు**

పంచాయతీల పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. కొత్త పాలకవర్గాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. మాస్టర్ ట్రైనర్లు



జిల్లాలోని ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల విధి విధానాలు, ఓటరు జాబితాల రూపకల్పన, వార్డుల విభజన తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. కొత్తగా ఏర్పడిన 8 పంచాయతీల్లో సైతం ఎన్నికలు జరగనున్నాయి. పాత పంచాయతీల పరిధిలోని అనుబంధ గ్రామాలు వేరుపడి పంచాయతీలుగా మారడంతో అక్కడ వార్డుల పునర్విభజన చేయనున్నారు. పంచాయతీలోని మొత్తం ఓటర్లను ఇంటి నంబర్లతో సహా భౌగోళికంగా వార్డుల విభజన చేయనున్నారు.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు**

మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి

ఉమ్మడి మండలంలో 8 కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి ఉత్తర్వులు వచ్చాయి. ఎన్నికలకు ముందస్తు కసరత్తు జరుగుతుంది. ఓటరు జాబితా రూపకల్పన, వార్డుల విభజన తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. కొత్త పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి ఏర్పాట్లు చేపడతాం.

## విశ్వవిద్యాలయం.. ఇంకెంత దూరం..?

ఖమ్మం : హైదరాబాద్ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు విద్యకు హబ్‌గా విరాజిల్లుతున్న ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం కొలువుదీరాలనే డిమాండ్ సుమారు రెండు దశాబ్దాలుగా వినిపిస్తోంది. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అర్హతలున్నా ముందడుగు పడటం లేదు. విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లటం.. చూద్దాం చేద్దామంటూ పాలకులు పెడచెవిన పెట్టడం పరిపాటిగా మారింది. సుమారు ఎనిమిది నెలల క్రితం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరటం, జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు మంత్రులుగా కీలక పదవుల్లో ఉండటంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వస్తోంది.

**అర్హతలున్నా..**

నైసర్గిక స్వరూపం, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఉమ్మడి ఖమ్మం జిల్లా అతిపెద్దది. ఏజెన్సీ ప్రాంతాల్లో పేదవర్గాలకు ఉన్నత విద్య అందటం లేదు. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కనీసం 240 ఎకరాల భూమి అవసరం. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు వందల ఎకరాలున్నాయి. విశ్వవిద్యాలయం పరిధిలో 200 కళాశాలలు ఉండాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అందుకు సరిపడా కళాశాలలు ఉన్నాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైతం ఖమ్మం జిల్లా కేంద్రంలో విద్యార్థులకు ఉపయుక్తంగా మారాయి. తాత్కాలికంగా విశ్వవి



ద్యాలయం ఏర్పాటుకు ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్, పీజీ కళాశాలల్లో వసతులు ఉన్నాయని విద్యావంతులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటైతే ఉన్నత విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

**ప్రతిపాదనలు బుట్టదాఖలు**

తెలంగాణ విద్యారంగానికి ఖమ్మం జిల్లా ఆయువుపట్టుగా ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 1975 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కొనసాగింది. 1976 నుంచి కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంటోంది. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పరిధిలో డిగ్రీ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు సాధిస్తుండటం విశేషం. సహజ వనరులు అపారంగా ఉన్న ఖమ్మం జిల్లాలో ఇంతవరకు విశ్వవిద్యాలయం లేకపోవటం విద్యారంగానికి పెద్దలోటు అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్, సివిల్స్ తదితర పోటీ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. కాలానుగుణంగా మారుతున్న కోర్సులు, సిలబస్, పరీక్ష పద్ధతులతో భవిష్యత్తు తరాలకు మేలు జరగాలంటే ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు ఒక్కటే మార్గమని మేధావులు సూచిస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని పాలకులు ప్రకటించినా ముందడుగు పడలేదు. ఉన్నత చదువుల కోసం జిల్లా విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. విశ్వవిద్యాలయం ఏర్పాటు విషయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

## కలమే నేస్తం.. హలమే బలం

నల్గొండ : ఒకప్పుడు వ్యవసాయం అంటే అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయి అన్నదాతలకు ఆర్థిక కష్టాలు ఎదురయ్యేవి. ప్రస్తుతం కాలం మారుతోంది. దాన్ని అనుసరించి అన్నదాతలు సాగులో వినూత్న పద్ధతులను అనుసరించి లాభాలు ఆర్జిస్తున్నారు. ఒకప్పుడు వరి, పత్తి లాంటి పంటల సాగుతో సంప్రదాయ సేద్యాన్ని అనుసరించిన అన్నదాతలు ఇప్పుడు సేంద్రియ వ్యవసాయంతో పాటూ వినూత్న పద్ధతులతో వాణిజ్య పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ, ఇతర పద్ధతులను అనుసరించడంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులు రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే ముందంజలో ఉన్నారని ఇటీవలే ప్రభుత్వం వెలువరించిన సామాజిక ఆర్థిక ముఖచిత్రంలో వెల్లడించడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

**కార్పొరేట్ కంపెనీలు సైతం**

ఆధునికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ కాలంలో ఎక్కువ కార్పొరేట్ కంపెనీలు ప్రయోగానికి వ్యవసాయ రంగాన్నే ఎంచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ఫార్మా రంగంలో పేరు ప్రఖ్యాతలు ఉన్న డాక్టర్ రెడ్డీస్ కంపెనీ తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు ప్రయోగాలు చేసి రైతులకు వరి సాగులో వెదజల్లే పద్ధతిని పరిచయం చేసింది. తక్కువ ఖర్చుతో పాటూ తక్కువ నీటి అవసరాలు, ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా వారు రైతులను కార్యోన్ముఖులను చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం నాలుగైదు వేల ఎకరాల్లో మాత్రమే వెదజల్లే పద్ధతి అమల్లో ఉండగా...ప్రస్తుతం అది 50 వేల ఎకరాల వరకు చేరింది.

**వినూత్నం వైపు మొగ్గు..**

డిజిటల్ మీడియా అందుబాటులోకి వచ్చాక సాగులో మెలకువలు తెలుసుకునేందుకు రైతులు స్మార్ట్‌ఫోన్లపై ఆధారపడ్డారు. మరోవైపు ఒకప్పుడు కూలీలకే పరిమితమైన మహిళలు ఇప్పుడు స్వయంగా వ్యవసాయంలోనూ రాణిస్తున్నారు. పట్టుపురుగుల పెంపకం మొదలుకొని కూరగాయల సాగు, పండ్లతోటల పెంపకం, సంప్రదాయ వరి సాగులోనూ మనుషులు లేకుండానే నాట్లు వేసే నుంచి ధాన్యం నూర్పిడిల వరకు యాంత్రీకరణనే ఉపయోగిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సాగు భూమి ఉన్న ఉమ్మడి జిల్లాలో మొత్తం రైతులు 9.95 లక్షలు కాగా...ఇందులో మహిళా రైతుల సంఖ్య 2.5లక్షలకు పైమాటే. మహిళలతో పాటూ యువతా ఈ వృత్తిలోకి వచ్చి వివిధ ప్రయోగాలతో ఆకట్టుకుంటున్నారు. ఇతర రైతులకు లాభాలు వచ్చేలా ప్రోత్సహిస్తున్నారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన ఓ సర్వేలో రాష్ట్రంలో 30 ఏళ్లలోపు యువరైతులు సుమారు రెండు లక్షల మంది ఉమ్మడి జిల్లాలోనే ఉన్నారని వెల్లడైంది. దీంతో వీరంతా వంశపారంపర్యం నుంచి మొక్కుబడిగా వచ్చే కార్యక్రమంలా కాకుండా... మూస పద్ధతులను వీడనాడి, సృజనాత్మకంగా ఆలోచిస్తూ తక్కువ ఖర్చు పెట్టుబడులు పెడుతూ యంత్రాలను ఉపయోగించి...తక్కువ కాలంలో ఎక్కువ పంటలు తీస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

**జీడీడీపీలో ముందడుగు...**

స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి (జీడీడీపీ)లో హైదరాబాద్, రంగారెడ్డి తర్వాత నల్గొండ జిల్లానే ప్రథమ స్థానంలో ఉండటం విశేషం. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల జీడీడీపీలో వ్యవసాయ రంగం వాటానే 50 శాతానికి పైగా ఉండటం ఉమ్మడి జిల్లాలో సాగు ప్రాముఖ్యాన్ని తెలియజేస్తోంది. ఇది రానున్న ఐదేళ్లలో మరో 15 శాతానికి పైగా పెరిగే అవకాశముందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఒకప్పుడు ఇంటిపెద్దలకే పరిమితమైన వ్యవసాయాన్ని ప్రస్తుతం ఇంట్లో అందరూ సమష్టిగా చేసే విధంగా ఈ వృత్తి ఎదుగుతోంది. ఉపాధి కోసం కాకుండా ఈ రంగంలో రాణించాలనే తపన, రైతులకు తమ వంతుగా మరిన్ని కొత్త మార్గాలను అనుసరించే విధంగా యువ రైతులు ముందుకొస్తున్నారు.

గణాంకాలు

ఉమ్మడి జిల్లాలో రైతులు 9.95 లక్షలు

సాగు భూమి : 22 లక్షలు

మహిళా రైతులు : 2.5 లక్షలు

యువ రైతులు (30 ఏళ్లలోపు) 2 లక్షలు

జీడీడీపీ (రూ.కోట్లలో)

నల్గొండ 27,303.54

సూర్యాపేట 15,927.47


యాదాద్రి 13,851.53

రైతుబడితో వినూత్న పద్ధతులు తెలియజేస్తూ...

జూలకంటి రాజేందర్‌రెడ్డి

జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించి మంచి వేతనం వస్తున్నా.. దాన్ని వదిలేసి రైతులకు ఏదో ఒకటి చేయాలనే తలంపుతో డిజిటల్ మీడియా స్థాపించి సాగులో వినూత్న పద్ధతులను రైతులకు పరిచయం చేస్తున్నారు జూలకంటి రాజేందర్‌రెడ్డి. రైతుబడి అనే ఛానెల్‌ను స్థాపించి దేశ వ్యాప్తంగా సాగులో వినూత్న పద్ధతులు ఎక్కడ ఉన్నా వాటినీ మారుమూల ప్రాంతాల్లోని రైతులు వాడేలా వాటి అవసరం తెలియజేస్తున్నారు. వ్యవసాయాన్ని వదిలి కార్పొరేట్ వైపు ఉపాధి కోసం వెళుతున్న ఈ కాలంలో వ్యవసాయం వైపు వచ్చి రైతులకు యాంత్రీకరణతో తక్కువ ఖర్చు, ఎక్కువ దిగుబడులు సాధించేలా కృషి చేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

## నైపుణ్య వికాసం.. కొలువు సాకారం



పెద్దపల్లి : ఉద్యోగాల వేటలో చతికిల పడుతున్న యువతకు టాస్క్ ( తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) బాసటగా నిలుస్తోంది. అవకాశాలు కోల్పోతున్న యువతలో అత్యున్నత నైపుణ్య వికాసంపై శిక్షణ ఇస్తోంది. పరిశ్రమల నిర్వహణపై క్షేత్ర స్థాయి పర్యటనలు విద్యార్థుల్లో ఉద్యోగావకాశాలపై ఆత్మ విశ్వాసం కలిగిస్తున్నాయి. తక్కువ రుసుంతో విలువైన నైపుణ్యం నేర్పించడంతో చదువు ముగియగానే కొలువు కల నెరవేరుతోంది. ఉమ్మడి జిల్లాలో టాస్క్‌లో శిక్షణ, ఉపాధి అవకాశాలపై కథనం.

**పేద విద్యార్థులకు వరం**

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉపాధి నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి ఉద్యోగావకాశాలు కల్పించడమే దీని లక్ష్యం. ఆన్‌లైన్‌లో ఏటా ప్రవేశాలు స్వీకరిస్తున్నారు. ఒకసారి రుసుం చెల్లిస్తే విద్యాసంవత్సరం ముగిసే వరకు శిక్షణ ఉంటుంది. ఉన్నత విద్య అభ్యసించినా ప్రైవేటు కేంద్రాల్లో శిక్షణ పేద విద్యార్థులకు ఆర్థిక భారమవుతోంది. చదువుకునే చోటే భవితను మార్చే శిక్షణ ఇవ్వడంతో ఉద్యోగ కల సాకారం చేసుకుంటున్నారు. ప్రాంగణ నియామక శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగ కల సాకారం చేసుకునే విధంగా తోడ్పాటునిస్తుంది.

**ఏడాదికి 1,400కు పైగా ఉద్యోగాలు**

ఉమ్మడి జిల్లాలో 67 కళాశాలల్లో 16,997 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. టాస్క్ శిక్షణ కేంద్రం నిర్వహణ కోసం ప్రతి ఏడాది యాజమాన్యాలు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో శిక్షణ తీసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో సగటున 1,400 ఉద్యోగాలు పొందుతున్నారు.

**నైపుణ్య శిక్షణ ఇలా..**

ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడటం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం కల్పించడం. వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలు అందించడం.

ప్రత్యేక వర్క్‌షాప్స్ నిర్వహించి పోటీ ప్రపంచంలో రాణించేలా తర్ఫీదు ఇవ్వడం. పరిశ్రమల అవసరాలు.. సంస్థ యాజమాన్యాలు ఎలాంటి నైపుణ్యాలు ఆశిస్తున్నాయో వివరించడం.

**గూగుల్‌లో కొలువు**

డిగ్రీలో టాస్క్‌లో ప్రవేశం పొందా. ఉద్యోగ నైపుణ్యం, మెళకువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రాంగణ నియామకంలో పాల్గొన్నా. ఇంటర్వ్యూను ధైర్యంగా ఎదుర్కొన్నా. గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.6 లక్షలు సంపాదిస్తున్నా. ప్రత్యూష, జగిత్యాల

**మెలకువలు నేర్పించారు**

టాస్క్ శిక్షణలో ఉద్యోగానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలను వివరించారు. డిగ్రీ పూర్తి కాగానే ప్రాంగణ నియామకంలో ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం లభించింది. ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజీ ఉంది. తబుస్సుమ్, పెద్దపల్లి

**ఏడాదికి రూ. 22.18 లక్షల ప్యాకేజీ**

బీటెక్ సీఎస్సీలో ప్రవేశం తీసుకుని టాస్క్ శిక్షణలో పాల్గొన్నా. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలపై పట్టు సాధించా. ఓ కార్పొరేట్ కంపెనీలో ఏడాదికి రూ.22.18 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ప్రియాంక, కరీంనగర్

## నిధుల మంజూరు.. పనులిక జోరు



కామారెడ్డి : జిల్లాలోని సాగునీటి పథకాలను పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం-22, నాగమడుగు ఎత్తిపోతల పథకాలను ప్రాధాన్య జాబితాలో చేర్చింది. దీంతో పాటు ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టుల వద్ద నిర్వహణ నిమిత్తం చేపట్టాల్సిన పనులకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించింది.

**భూ సేకరణకు ఆదేశాలు**

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ప్యాకేజీ- 22 పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదేళ్లుగా బిల్లులు మంజూరు కాక గుత్తేదారు పనులను తాత్కాలికంగా నిలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నిధుల విడుదలకు అంగీకరించారు. సాగు నీటి పథకాల అభివృద్ధితో పాటు రూ.20కోట్లు భూసేకరణకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మిగులు నిధులతో సదాశివనగర్‌లోని యాచారం వద్ద ఉన్న టన్నెల్(సొరంగం) తవ్వకం పనులు, భూంపల్లి రిజర్వాయర్ నిర్మాణం, కాలువల తవ్వకం జరపనున్నారు. మంజీరనదిలో నిర్మించే నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ప్రాజెక్టుల ప్రాధాన్య జాబితాలో రెండో కేటగిరీలో చేర్చింది. ఇందుకు రూ.53.26 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం లభించింది.

**ఓఅండ్ఎం కింద..**

రాష్ట్రంలోని సాగునీటి పథకాల ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్(ఓఅండ్ఎం) కింద రూ.280 కోట్లు కేటాయించింది. ఈ నిధులు సీఈల ప్రతిపాదనల మేరకు వినియోగించే వెసులుబాటు ఉంది. నిజాంసాగర్ జలాశయం కింద చేపట్టే కాలువల మరమ్మతుకు ఇటీవలే రూ.14 లక్షల విడుదల చేశారు. పోచారం జలాశయం ఎగువన రహదారి నిర్మాణానికి రూ.22 లక్షల నిధులు మంజూరు చేశారు.

**ప్రతిపాదనలకు అనుగుణంగా**

శ్రీనివాస్, సీఈ, నీటిపారుదల శాఖ, కామారెడ్డి

కాళేశ్వరం ప్యాకేజీ-22తో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం ఇటీవలే నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. భూసేకరణ, ఇతరత్రా పనులకు నిధులు వినియోగిస్తాం.

## సతతం హరితం

కామారెడ్డి : అడవులు అంతరించిపోతున్న తరుణంలో లక్షలాది మొక్కలకు జీవం పోశారు. జిల్లాలో దాదాపు పదేళ్లలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 87.44 కిలోమీటర్ల విస్తీర్ణంలో 87.50 లక్షల మొక్కలు నాటి పూర్వవైభవం తెచ్చారు. నాటిన మొక్కలు ఏపుగా ఎదిగి పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అంబారిపేట అటవీ బీట్ పరిధిలోని 135.95 హెక్టార్లలో సహజ సిద్ధ అడవులు అంతరించి కళావిహీనంగా కనిపించేది. ఇక్కడ లక్షలాది మొక్కలు నాటి పచ్చదనంగా మార్చారు. ఉమ్మడి దోమకొండ, మాచారెడ్డి మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. రామారెడ్డి మండలం ఖన్నాపూర్ బీట్, పిట్లం రేంజి పరిధిలోని బ్రాహ్మణపల్లి, మంగ్లూర్ బీట్, మంగ్లూర్, మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో లక్షలాది మొక్కలు నాటారు. మాచారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, కామారెడ్డి మండలాల్లోని 50 హెక్టార్లలో మొక్కలు పెంచి సంరక్షించారు.

**రకరకాల వృక్షాలు**



కంపా నిధులతో రకరకాల మొక్కలు నాటుతున్నారు. రావి, మర్రి, జువ్వి, మేడి, తాని, ఉసిరి, అల్లనేరేడు, సీతాఫలం, వెలగ, గుమ్మడి టేకు, తెల్లచిందుగ, నల్ల చిందుగ, పాలకొడిచ, నెమలినార, రేల, పెద్దమాను, గిరిషనమ్, సొప్పెర, నర్లింగ, పనస, మారేడు, చింత, తెల్లమద్ది, ఎగిస, జిట్రేగి, వేప, కానుగ, బట్టగానం, సీమచింత, వెదురు, సీమారుబా తదితర మొక్కలు నాటి పెంచుతున్నారు.

**వన్యప్రాణులకు జీవనాధారం**

మొక్కల పెంపకం వన్యప్రాణులకు జీవనాధారంగా మారుతోంది. కోతులు, కొండెంగలు వంటి ప్రాణులు గ్రామాల్లోకి రావడం తగ్గుతాయి. అడవి పందులు, జింకలు, మనుబోతులు, దుప్పులు, కొండగొర్లు, కుందేళ్లు పంటలపై దాడి చేయకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. వీటికి అటవీ ప్రాంతంలోనే సమృద్ధిగా ఆహారం లభించేలా ఏర్పాటు చేస్తున్నారు.

## సూది మందు రావట్లే..

ఆసిఫాబాద్ : రెండు కిడ్నీలు చెడిపోయిన వారి ఆరోగ్యం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి. వారానికి కనీసం రెండు మూడు సార్లు దయాలసిస్ (ఆరోగ్య స్థితిని బట్టి రక్తశుద్ధి) చేయించుకోవాలి. ఆ సమయంలో రక్తం పెరగడానికి ఇచ్చే సూది మందు (ఎరిత్రో పొయిటిన్ ఇంజిక్షన్) నెలరోజులకు పైగా కొరత ఉండడంతో.. బాధితులు ప్రైవేటులో కొనుగోలు చేసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. దయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఆసరా పింఛను, బస్సు పాసులు అందిస్తుండగా.. చాలామందికి రావడం లేదు. ఇటు సూదిమందు కొరత, అటు పింఛన్ అందక బాధితులు నానాపాట్లు పడుతున్నారు.

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తశుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు 76మంది చికిత్సలు పొందుతున్నారు. వీరే కాకుండా పేర్లు నమోదు చేసుకోని వారు మరో 15-20 మంది వరకు ఉంటారని అంచనా. వీరంతా వారానికి 2-3 సార్లు దయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్కోకేంద్రంలో అయిదేసి పడకలు ఉండగా, నిత్యం ఒక్కోచోట 4-5 విడతల్లో 15-20 మంది రోగులకు మాత్రమే రక్తశుద్ధి చేసే అవకాశం ఉంది. పడకలు, సిబ్బంది సంఖ్యను పెంచితే మరింత మంది చికిత్సకు అవకాశం ఉంటుంది. ఇక్కడ అవకాశం లేక కొందరు మంచిర్యాల, ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలివెళ్తున్నారు. ఇక్కడ ఉచిత చికిత్స



పొందుతున్నా.. మందులు, ఇతర వాటికి నెలకు ఒక్కో రోగికి కనీసం రూ.4-5 వేల వరకు ఖర్చు అవుతోంది. చాలామందికి పింఛన్ అందక సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేస్తున్నారు. కొందరు పేదలు మాత్రం కొనుగోలకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

**ప్రభుత్వం నుంచే సరఫరా నిలిచి..**

నెలలో పది దయాలిస్‌లు చేస్తే నాలుగు సార్లు రక్తం పెరిగే(ఈపీవో, ఎరిత్రో పొయిటిన్) సూది మందు ఇవ్వాలి. ఇది తీసుకున్నాక మరోసారి దయాలిసిస్ చేసే సమయంలో ఐరన్ ఇంజిక్షన్ ఇస్తారు. రెండు కేంద్రాలకు నెలకు పైగా ప్రభుత్వం నుంచి ఈ సూది మందులు రావడం లేదు. ఇవి తీసుకోకుంటే రోగిలో రక్తం పెరగక త్వరగా నీరసించే ప్రమాదం ఉంటుంది. ఈపీఓ సూదిమందు మార్కెట్‌లో రూ.1150 నుంచి రూ.1800 వరకు (ఒక్కో చోట ఒక్కో తీరు), ఐరన్ ఇంజిక్షన్ రూ.200-250 వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులే బయట కొనాల్సి వస్తోంది. ఇప్పటికే నెలకు మందులతోపాటు ఈ ఖర్చులతో అదనపు భారం మోయాల్సి వస్తుందని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఈ సూది మందులను వెంటనే తెప్పించి రోగులకు మేలు చేయాలని కోరుతున్నారు.

**అధికారి వివరణ**

సూదిమందు కొరతపై ఆసుపత్రి పర్యవేక్షణాధికారి చెన్నకేశవులును చరవాణిలో సంప్రదించగా.. వీటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి కొరత ఉన్నట్లు చెప్పారు. చిత్రంలో కనిపిస్తున్నది కెరమెరి మండలం గోయగాంకు చెందిన విఠల్, సాంగ్వికి చెందిన కాశీనాథ్, వాంకిడి మండలం బెండారకు చెందిన భుజంగ్‌రావు.. వీరంతా కిడ్నీ వ్యాధిగ్రస్థులు. జిల్లా కేంద్రంలోని దయాలిసిస్ కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చారు. వీరికి బస్సు పాసులు జారీ చేసినా, పింఛన్ రాలేదని చెబుతున్నారు. నెల రోజులకు పైగా ఇక్కడ రక్తం పెరిగే, ఐరన్ ఇంజిక్షన్లు లేక బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొంటున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి సూది మందులు తెప్పించి పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.



# జగన్.. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత మీకు లేదా?

అమరావతి: గత ప్రభుత్వంలో దేవాలయాల్లో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ దేవుడిని దర్శించుకోవచ్చని.. కానీ ఆయనకు వేంకటేశ్వరస్వామి పై నమ్మకం ఉందా? లేదా? అనేది ముఖ్యమన్నారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత జగన్‌కు లేదా? అని నిలదీశారు. ఈ మేరకు 'ఎక్స్'లో చంద్రబాబు పోస్ట్ చేశారు. "నమ్మకం ఉంటే అన్యమ తస్థులు సంప్రదాయం ప్రకారం తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలి. అలా డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత జగన్‌కు లేదా? సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమల ఎందుకు వెళ్లాలి? మీకు అధికారం ఇచ్చింది సంప్రదాయాలకు విరుద్ధంగా పని చేయడానికి కాదు. అది అడిగితే బూతులు తిట్టారు. వైకాపా హయాంలో జరిగిన ఘటనల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రథం కాలిపోతే.. ఏముందీ తేనెటీగలు వచ్చాయి అన్నారు. తిరుమల పోటులో అగ్ని ప్రమాదం జరిగితే ఏమవుతుందని వ్యాఖ్యానించారు. ఇలా నిర్లక్ష్యంగా ప్రవర్తించి మనోభావాలు దెబ్బతీశారు. అందుకే భగవంతుడికి అందరం క్షమాపణ చెప్పాలి. ఇక ఆయనే చూసుకుంటాడు. అపచారం చేసి ఆ అబద్ధాలను నిజాలుగా చేయాలని చూడటం స్వామి ద్రోహం" అని చంద్రబాబు పేర్కొన్నారు.



## మోదీ ప్రపంచ నాయకుడిగా ఎదిగారు: సీఎం చంద్రబాబు

అమరావతి: అమెరికా పర్యటన ముగించుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత్‌కు తిరిగివస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఆయనకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'విజయవంతంగా అమెరికా పర్యటన ముగించుకొని భారత్‌కు విచ్చేస్తోన్న ప్రధాని మోదీకి స్వాగతం. ఆయనలాంటి గొప్ప రాజనీతిజ్ఞుడి నాయకత్వంలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో భారత్ స్థానాన్ని బలపరచడంతోపాటు ప్రపంచ నాయకుడిగా ఎదిగారు. దేశాలను, జాతులను ఐక్యం చేయడంలో ప్రధాని కృషి ప్రశంసనీయం. ఐక్యరాజ్య సమితిలో ప్రధాని ప్రసంగం.. రాబోయే రోజుల్లో ప్రపంచవేదికపై మనం పోషించబోయే పాత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది"అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రియల్‌టైమ్ గవర్నెన్స్.. పౌర సేవలపై ప్రత్యేక ప్రాజెక్ట్: సీఎం చంద్రబాబు



అమరావతి: రియల్‌టైమ్‌లో సమస్యలపై ప్రభుత్వం స్పందించే విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు సత్వర సాయం అందుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీ) ద్వారా పౌర సేవలు, ప్రభుత్వ కార్యక్రమాలపై 100 రోజుల్లో ప్రత్యేక ప్రాజెక్ట్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న సెంటర్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు. అనంతరం ఆర్టీజీ సెంటర్‌లోనే సీఎస్, డీజీపీ సహా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పౌరసేవలను సులభతరం చేయడం, పాలనలో వేగం పెంచడంపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు సంబంధించిన మాస్టర్ డేటాను అన్ని శాఖలు యాక్సిస్ చేసుకొని సత్వర సేవలను అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆధార్, వ్యాక్సినేషన్ డేటా, స్కూల్ అడ్మిషన్, రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లకు సంబంధించి కార్యక్రమాలు ప్రజలకు ఆటోమెటిక్‌గా అందే అంశంపై చర్చించారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్, ప్రమాదాలు, నేరాలు, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువల నిర్వహణ, అగ్రికల్చర్, వరదలు, భారీ వర్షాలు, విపత్తులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా తీసుకోదగిన చర్యలపై అధికారులతో సీఎం చర్చలు జరిపారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు వంటి వాటి ద్వారా డేటా విశ్లేషణ, ప్రభుత్వ సేవల అందజేత, నాణ్యతపై సమావేశంలో చర్చించారు.


## రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో కీలక పరిణామం..

అమరావతి: అప్పటి నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి విజయపాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజును.. సీఐడీ కస్టడీలో విజయ్‌పాల్ చిత్రహింసలు పెట్టారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారులపై కేసు నమోదు చేయాలని గుంటూరులో రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన గుంటూరు నగరపాలెం పోలీసులు.. విజయపాల్‌తో పాటు అప్పటి సీఎం జగన్, సీఐడీ డీజీ సునీల్, ప్రభుత్వాసుపత్రి.. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని నిందితులుగా పోలీసులు చేర్చారు. కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయపాల్ కోర్టులో పిటిషన్ వేశారు. విజయ్‌పాల్ తరఫున సుప్రీంకోర్టు కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా, పీపీ లక్ష్మీనారాయణ,.. రఘురామ కృష్ణంరాజు తరఫున న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. న్యాయస్థానం విజయపాల్‌కు బెయిల్ నిరాకరించడంతో మిగతా అధికారుల్లో వణుకు మొదలైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. విజయ్‌పాల్ తన ఆరోగ్యం బాగోలేదని ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేశారని.. ఈరోజు విచారణ జరిపిన న్యాయస్థానం బెయిల్ నిరాకరించడం శుభపరిణామమని అన్నారు. తనను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టడానికి అనువైన వాతావరణాన్ని విజయ్‌పాల్ సృష్టించారని అన్నారు. ఇలాంటి పనికిమాలిన పనులన్నీ విజయ్‌పాల్ చేశారని మండిపడ్డారు. త్వరలో రిటైర్డ్ ఎస్పీ మహిపాల్ అరెస్ట్ అవుతారని, అలాగే సునీల్‌కుమార్ కూడా అరెస్ట్ అవుతారని.. విచారణ వేగవంతమవుతుందనే ఆశాభావంలో ఉన్నానని రఘురామకృష్ణంరాజు ఏబీఎన్‌తో పేర్కొన్నారు. కాగా నరసాపురం మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు కేసులో ఎట్టకేలకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఆయనపై హత్యాయత్నం,




థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసు అధికారులు, సిబ్బందిని త్వరలోనే అరెస్టు చేయనున్నారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రఘురామరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ 2021లో ఆయనపై దేశద్రోహం కింద కేసు నమోదుచేసిన సీఐడీ అధికారులు.. ఆ ఏడాది మే 14న జన్మదినం రోజున ఆయన్ను హైదరాబాద్ నుంచి బలవంతంగా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఆరోజు రాత్రి కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడినట్లు రఘురామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీసు సేషన్లో కేసు నమోదైంది. నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్(ఏ-1), అప్పటి నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ-2), మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి (ఏ-3), సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్(ఏ-4), అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి (ఏ-5)తదితరులపై ఐపీసీ 120బీ, 166, 167, 197, 307, 326, 465, 506(34) తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే రోజులు గడుస్తున్నా కేసులో ఎటువంటి పురోగతీ లేదంటూ రఘురామరాజు పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. నేరుగా గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్‌ను కలిసి దర్యాప్తు వేగవంతం చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

## ఏపీ మహిళా కమిషన్‌ను వెంటనే తొలగించండి.. ప్రభుత్వం ఆదేశాలు



అమరావతి, సెప్టెంబర్ 24: ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ గజ్జెల లక్ష్మికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆమె పదవి కాలం ఆగస్టులోనే ముగియడంతో వెంటనే తొలగించాలని ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు సంబంధిత శాఖకు ఆదేశాలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఈరోజు ఉదయం గజ్జెల లక్ష్మి ప్రకటించారు. ఆమెకు నిన్ననే ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. చైర్మన్‌కు ఉద్వాసన పలకడంతో సభ్యుల పదవి కాలం పూర్తి అయినట్టే అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. ముంబై నటి కాదాంబరి జెత్వాని కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ గతంలో గజ్జెల లక్ష్మి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇతర రాష్ట్రాల మహిళల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని, ఆమె ముంబయికి చెందిన మహిళ కాబట్టి మహరాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించాలంటూ వెంకటలక్ష్మి ఇచ్చిన ఉచిత సలహాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల మహిళల విషయంలో తాము సుమోటోగా కేసు తీసుకోలేమంటూ ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ చెప్పిన మాటలతో దుమారం చెలరేగింది.

ఉన్నత చదువులు చదివిన కాదంబరి ముందుగా ఏపీ మహిళా కమిషన్‌ను ఎందుకు ఆశ్రయించలేదని బాధితురాలిపైనే ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ప్రశ్నలు సంధించడంపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.




# విజయవాడ దుర్గ గుడి మెట్లు శుభ్రం చేసిన పవన్‌కల్యాణ్

విజయవాడ: తిరుమల లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గ ఆలయంలో ఆయన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అధికారులు పవన్‌కు స్వాగతం పలికారు.

అనంతరం ఆలయం వద్ద మెట్లను ఆయన శుభ్రం చేశారు. ఆ తర్వాత మెట్లకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దుర్గమ్మను పవన్ దర్శించుకున్నారు.

ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని), బాలశౌరి, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష విరమించేందుకు పవన్ అక్టోబరు 1న తిరుపతి నుంచి అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు నడుచుకుంటూ వెళ్లనున్నారు. 2న ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం దీక్ష విరమించనున్నారు.

## ఇజ్జత్ పాయె.. రోజాకు దిమ్మతిరిగే పంచ్




తిరుపతి, సెప్టెంబర్ 24: వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజాకు జబర్దస్ పంచ్ పడింది. తన యూట్యూబ్ ఛానెల్‌లో తిరుపతి లడ్డూ వ్యవహారంపై ఆమె పోల్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్కే రోజాకు నెటిజన్లు గట్టి ఝలక్ ఇచ్చారు. తిరుపలి లడ్డూలో కల్తీ చేసింది ఎవంటూ రోజా తన యూట్యూబ్ చానెల్‌లో పోల్ చేపట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌దే తప్పంటూ 74 శాతం మందికిపైగా నెటిజన్లు ఓటు వేశారు. అలాగే ఎవరి పాలనలో తిరుమల బాగుందంటూ ఆమె పోల్ పెట్టారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే తిరుపతి బాగుందంటూ 77 శాతం మందికి పైగా ఓటు వేశారు. తిరుమలలో కొలువు తీరిన శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు బాబుతోపాటు కేంద్ర ప్రభుత్వం సైతం స్పందించింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సైతం స్పందించారు. ఆ క్రమంలో చంద్రబాబుతోపాటు ఆయన ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇక వై ఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డ్ చైర్మన్‌గా వ్యవహరించిన భూమన కరుణాకర్ రెడ్డి సైతం సోమవారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకుని హడావుడి సృష్టించిన విషయం విధితమే. అలాంటి వేళ.. ఆర్కే రోజా తన యూట్యూబ్ చానెల్ ద్వారా తిరుపతి లడ్డూ వ్యవహారంపై పోల్ నిర్వహించారు. అలాగే చంద్రబాబు పాలనపై సైతం ఆమె ఈ సందర్భంగా పోల్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూ ప్రసాదంలో గత జగన్ ప్రభుత్వం తప్పు ఉందంటూ ఈ పోల్‌లో నెటిజన్లు ఓటు వేశారు. ఇక చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరి 100 రోజులు పూర్తి చేసుకుంది. దీంతో ఇది మంచి ప్రభుత్వం అంటూ కూటమి ప్రభుత్వం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిని కూటమి నేతలు ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లారు. అలాంటి వేళ.. గత జగన్ ప్రభుత్వ పాలన బాగుందా? చంద్రబాబు పాలనా బాగుందా? అంటూ పోల్ నిర్వహించింది. అందులో సైతం చంద్రబాబు పాలనకే నెటిజన్లు మద్దతు ప్రకటించారు. దీంతో ఆర్కే రోజాకు నెటిజన్లు జబర్దస్త్ ఝలక్ ఇచ్చిరానే ఓ చర్చ సైతం వాడి వేడిగా పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తుంది.

## తిరుపతిలో స్వామీజీల ఆందోళన.. లడ్డూ ప్రసాదం కల్తీపై ఆగ్రహం




తిరుపతి: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై స్వామీజీలు నిరసన బాట పట్టారు. తిరుపతిలో ఆందోళన చేపట్టారు. ఏపీ, తెలంగాణ సాధు పరిషత్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన కొనసాగింది. తిరుపతిలోని తితిదే పరిపాలన భవనం ఎదుట నిరసనకు దిగారు. 'సేవ్ తిరుమల.. సేవ్ తితిదే' అంటూ నినాదాలు చేశారు. తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాల్లో అన్యమతస్థులను ఉద్యోగులుగా నియమించవద్దని డిమాండ్ చేశారు. తితిదే ఈవోకు వినతిపత్రం ఇచ్చేందుకు భారీగా స్వామీజీలు తరలివచ్చారు. గత పాలకమండలి ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, అప్పటి ఈవోలు జవహర్ రెడ్డి, ధర్మారెడ్డి తదితరులపై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ స్వామీజీలు ధర్నా చేశారు. వారిని పోలీసులు నిలువరించారు. తితిదే ఈవో శ్యామలరావు వారిని చర్చలకు ఆహ్వానించగా.. 10 మంది సాధువులు వెళ్లారు.

## తప్పు చేసింది ఎంతటి వారైనా ఉపేక్షించం: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



తిరుమల: శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీపై 'సిట్' నిజానిజాల నిగ్గు తేలుస్తుందని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. తప్పు చేసింది ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. విజిలెన్స్, సిట్ నివేదిక ఆధారంగా బాధ్యులను శిక్షిస్తామన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "తిరుమలలో ఎలాంటి అపవిత్ర కార్యక్రమాన్నీ జరగనివ్వం. ప్రస్తుతం నాణ్యమైన నెయ్యితో లడ్డూ, అన్నప్రసాదాలను తితిదే తయారు చేస్తోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరగాలని స్వామివారిని ప్రార్థించా. అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తితిదే అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. వెంకటగిరి పోలేరమ్మ జాతర, కన్యకా పరమేశ్వరి పండుగలను రాష్ట్ర పండుగల జాబితాలో చేర్చాం. తితిదేకు త్వరలోనే పాలక మండలి ఏర్పాటు చేస్తాం" అని ఆయన అన్నారు.

## అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా..




అమరావతి: వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు, వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డిముందస్తు బెయిల్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం తదుపరి విచారణ నవంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌తో పాటు మరో నిందితుడు శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు పిటీషన్‌పై కూడా విచారణ జరపాలంటూ వివేకా కుమార్తె డాక్టర్ సునీత పిటీషన్ వేశారు. దీనినిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. మరోవైపు వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని శివశంకర్ రెడ్డి కుమారుడు బెదిరించాడని, దానిపైనా విచారణ జరపాలని ఈరోజు సునీత తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్ధ లూథ్రా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అవినాష్, శివశంకర్ రెడ్డి, అతని కుమారుని కేసు…ఈ మూడింటిని ఒకేసారి వినాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. మూడు కేసులను ఒకేసారి వినడానికి ధర్మాసనం అంగీకరిస్తూ.. తదుపరి విచారణను నవంబర్ 5వ తేదీకి వాయిదా వేసింది.

## వివేకా హత్య కేసు.. శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని సునీత పిటిషన్



దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఆయన కుమార్తె సునీత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఆమె పిటిషన్ వేశారు. మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్లనీ కలిపి విచారించాలని ఆమె తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్లన్నీ కలిపి నవంబర్ 5న ఒకేసారి విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. వీటన్నింటికీ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం అంగీకారం తెలిపింది.

## నాలుగు పదుల వయసులో ఇదేం రచ్చ జగతి మేడం

కన్నడ నటి జ్యోతి రాయ్ ను తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ముఖ్యంగా బుల్లితెర ప్రేక్షకులు జగతి మేడం అంటూ జ్యోతి రాయ్ ను తెగ అభిమానిస్తూ ఉంటారు. ఆమె ను సీరియల్స్ లో పెద్ద వయసు ఉన్న పాత్రలో చూసి సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు చూసిన వారు అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. బాబోయ్ జగతి మేడం ఇంత వయసు తక్కువ అమ్మాయిగా కనిపిస్తుంది అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. పాతికేళ్ల అమ్మాయి మాదిరిగా జ్యోతి రాయ్ సోషల్ మీడియా లో షేర్ చేసిన ఫోటోలు ఉంటాయి అనే కామెంట్స్ వస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి జ్యోతిరాయ్ ఫోటోలతో సోషల్ మీడియాలో రచ్చ చేసింది. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉన్న ఈమె మరోసారి క్లీవేజ్ షో అందాలతో కవ్విస్తూ కన్నుల విందు చేస్తుంది. సాధారణంగా హీరోయిన్స్ కి సోషల్ మీడియాలో తెగ పాపులారిటీ ఉంటుంది. బుల్లి తెర స్టార్స్ అంటే



లైట్ తీసుకుంటారు. కానీ జ్యోతి రాయ్ కి మాత్రం హీరోయిన్స్ రేంజ్ లో గుర్తింపు ఉంది అనడంలో సందేహం లేదు. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలకు లక్షల్లో లైక్స్, వేలల్లో కామెంట్స్ షేర్స్ నమోదు అవుతున్నాయంటే ఆమె క్రేజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. కన్నడకు చెందిన జ్యోతి రాయ్ వయసు నాలుగు పదుల వయసుకు చేరువ అయింది. కానీ పాతికేళ్ల అమ్మాయి మాదిరిగానే కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. మరోసారి జ్యోతి రాయ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోల వల్ల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కన్నడ సీరియల్స్ ద్వారా కెరీర్ ను ప్రారంభించిన ఈమె తెలుగు లో ఎక్కువ పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ పాపులారిటీతోనే సిరిమాల్లో, సిరీస్ ల్లోనూ నటిస్తూ కెరీర్ లో ముందుకు సాగుతోంది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం జగతి మేడంకే చెల్లింది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. జ్యోతి రాయ్ ఓకే అనాలే గాని వరుసగా ఐటెం సాంగ్స్ చేసే అవకాశాలు సైతం రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈమె గతంలో కన్నడ దర్శకుడు సుక్కు పూర్వాజ్ తో రిలేషన్ లో ఉ ందనే వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ప్రెట్టీ గర్ల్, నో మోర్ సీక్రెట్స్ అనే వెబ్ సిరీస్ ల్లో నటిస్తోంది. త్వరలోనే ఆ వెబ్ సిరీస్ లు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. తెలుగు తో పాటు ఇతర భాషల్లోనూ ఈమెకు ఉన్న క్రేజ్ కారణంగా అన్ని భాషల్లోనూ డబ్ చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. సోషల్ మీడియాలో తరచూ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తున్న జ్యోతి రాయ్ మరి కొంత కాలం ఇదే అందంతో అలరించాలని ఫ్యాన్స్ కోరుకుంటూ ఉన్నారు.

## బాబోయ్ పిచ్చెక్కిస్తున్న ఎన్టీఆర్ లైనప్..!

త్వరలో దేవరతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఎన్టీఆర్ ఈ సినిమా తో తన మాస్ స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యాడు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన దేవర మొదటి భాగం 27న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా విషయంలో తారక్ నమ్మకం చాలా గట్టిగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఆల్రెడీ ఈ పాటికి ఒకటికి రెండు సార్లు సినిమా చూసి ఉంటాడు కాబట్టి అందుకే ఫ్యాన్స్ కి ఈ సినిమా ఫీస్ట్ అందిస్తుందని బల్లగుద్ది చెబుతున్నాడు తారక్. దేవర 1 తర్వాత ఇప్పటికే వార్ 2 సినిమా కోసం షూటింగ్ లో పాల్గొన్న ఎన్టీఆర్ ఆ సినిమాను పూర్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో ఒక సినిమా లైన్ లో ఉంది. ఆ సినిమా పూజా కార్యక్రమాలు ఈమధ్యానే జరిగాయి. మరోపక్క తమిళ దర్శకుడు వెట్రిమారన్ తో తారక్ సినిమా ఒకటి ప్లానింగ్ లో ఉంది. రీసెంట్ గా దేవర చెన్నై



ప్రమోషన్స్ లో వెట్రిమారన్ డైరెక్షన్ లో చేయాలని ఉందన్న ఎన్టీఆర్ కామెంట్స్ తెలిసిందే. తప్పకుండా ఈ సినిమా వస్తుందని అంటున్నారు. వెట్రిమారన్ తర్వాత మరో తమిళ దర్శకుడు అట్లీ కూడా ఎన్టీఆర్ తో సినిమా చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. జవాన్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్న అట్లీ మంచి కథతో వస్తే తారక్ కాదనకపోవచ్చు. ఇక యానిమల్ మేకర్ సందీప్ రెడ్డి వంగ కూడా తారక్ తో సినిమా చేయాలని అనుకుంటున్నాడట. స్పిరిట్, యానిమల్ 2, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ సినిమాల తర్వాత సందీప్ ఎన్ టీ ఆర్ సినిమా ఉంటుందని తెలుస్తుంది.

వీరే కాకుండా ఎన్టీఆర్ తో బాలీవుడ్ క్రేజీ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలి కూడా ఒక సినిమా అనుకుంటున్నాడట. ఇలా క్రేజీ డైరెక్టర్స్ అంతా కూడా తమ కథలకు తారక్ పర్ఫెక్ట్ అని భావిస్తున్నారు. కాస్త లైన్ అటుఇటైనా ఈ కాంబో కుదిరితే మాత్రం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అంతా కూడా పండగ చేసుకుంటారని చెప్పొచ్చు. ఎన్టీఆర్ రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ పై తన ముద్ర వేయాలని చూస్తున్నాడు.




## సందీప్ కిషన్ న్యూ 'మజాకా'



టాలెంటెడ్ యువ హీరో సందీప్ కిషన్ ప్రతీ సినిమాలో ఏదో కొత్త తరహా కాన్సెప్ట్ ను హైలెట్ చేస్తూ ఉంటాడు. అలాగే భాషతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ఆడియెన్స్ కు దగ్గరవుతున్నాడం. ఇక తన 30వ సినిమాలో కూడా ఒక డిఫరెంట్ ఎంటర్టైన్మెంట్ అందించబోతున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమాకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్డేట్స్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సందీప్ కొత్త చిత్రానికి 'ధమాకా' దర్శకుడు త్రినాథ రావు నక్కినా దర్శకత్వం వహిస్తున్నారు. AK ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ మరియు జీ స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా, రాజేశ్ దండా నిర్మాణంలో సిద్ధమవుతోంది. ఇది ఒక మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించబడుతోంది, అందుకే ప్రమోషన్స్‌ను ప్రారంభించిన దశలో, టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. SK30 అనే ఈ చిత్రానికి 'మజాకా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు, ఇది ఒక డిఫరెంట్ కామెడీ డ్రామాగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ సాంప్రదాయ పట్టు పంచే మరియు షర్ట్ ధరించి సంతోషంగా కనిపిస్తున్నాడు. అతను పెద్ద కుర్చీలో కూర్చొని, పెద్ద టేప్ రికార్డర్ ను భుజంపై పెట్టుకున్నాడు. అతని మోడ్రన్ వాచ్ మరియు షూస్, చుట్టూ ఉన్న పూలు, పండ్లు మరియు సంగీత వాయిద్యాలు ఈ ఉత్సవాత్మక వాతావరణాన్ని మరింత అందంగా మార్చుతున్నాయి. సందీప్ కిషన్ ముఖంలో ఉ న్న అందమైన చిరునవ్వు, ఈ చిత్రానికి అదనపు ఆకర్షణను ఇస్తుంది. ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో రావు రమేష్ కనిపిస్తారు. మేకర్స్ ఇచ్చిన అప్డేట్ ప్రకారం, 'మజాకా' సంక్రాంతికి విడుదలకు సిద్ధంగా ఉంది. సంక్రాంతి సీజన్ ఈ మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ విడుదల చేసేందుకు అత్యంత అనుకూలమైన సమయం అని చెప్పవచ్చు. ప్రసన్న కుమార్ బేజవాడ, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే మరియు డైలాగ్స్ రాస్తున్నారు. ఆయన త్రినాథ రావు నక్కినాతో ఉన్న కాంబినేషన్ ను మరోసారి కొనసాగిస్తూ ఉండడం విశేషం. వీరి కలయికలో ఇంతకుముందు వచ్చిన సినిమాలు అన్ని కూడా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ఇక ఇప్పుడు అంతకుమించి అనేలా ఎంటర్టైనర్ ను సిద్ధం చేస్తున్నారు. లియాన్ జేమ్స్ సంగీతం అందిస్తుండగా నిజార్ షఫీ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కళా దర్శకత్వానికి బ్రహ్మ కడాలి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించి సంగీత ప్రమోషన్లు ప్రారంభమవుతాయని మేకర్స్ తెలిపారు.

## ప్రశాంత్ వర్మ మిస్టరీ ఐలాండ్.. కథ క్లిక్కయ్యిందా లేదా?



టాలీవుడ్ లో డైరెక్టర్ ప్రశాంత్ వర్మకి ఇప్పుడు మంచి బ్రాండ్ ఇమేజ్ ఉంది. 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా డైరెక్టర్ గా ప్రశాంత్ వర్మ ప్రూవ్ చేసుకున్నారు. దీంతో అతను కథ అందిస్తే కచ్చితంగా ఆ సినిమా లేదంటే వెబ్ సిరీస్ కి మంచి ఆదరణ వస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ప్రశాంత్ వర్మ గతంలో 'అద్భుతం' అనే సినిమాకి స్టోరీ అందించారు. అయితే ఆ మూవీ పెద్దగా మెప్పించలేదు. గల్లా అశోక్ హీరోగా తెరకెక్కిన 'దేవకీ నందన వాసుదేవ' అనే మూవీకి ప్రశాంత్ వర్మ స్టోరీ అందించారు. ఈ మూవీ ఇంకా రిలీజ్ కాలేదు. ఇదిలా ఉంటే ఆయన స్టోరీ అందించిన 'ది మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' వెబ్ సిరీస్ రీసెంట్ గా రిలీజ్ అయ్యింది. యాక్టర్ కమ్ డైరెక్టర్ అయిన అనీష్ కురువిళ్ళ దర్శకత్వంలో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. రీసెంట్ గా డిస్నీ హాట్ స్టార్ లో ఈ వెబ్ సిరీస్ రిలీజ్ అయ్యింది. క్రైమ్ థ్రిల్లర్ జోనర్ లో 'ది మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' వెబ్ సిరీస్ వచ్చింది. అగాథా క్రిస్టి నవల, హాలీవుడ్ మూవీ స్క్వాడ్ గేమ్ ల నుంచి స్ఫూర్తి పొంది 'ది మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' వెబ్ సిరీస్ కథని ప్రశాంత్ వర్మ, సంజయ్ రాయ్ సంయుక్తంగా రాశారు. ఈ సిరీస్ లో అశుతోష్ రానా, ప్రియా ఆనంద్, భానుచందర్, నందు, తేజస్వి మాదివాడ, ఆదర్శ్ బాలకృష్ణ లాంటి గుర్తింపు ఉ న్న యాక్టర్స్ కీలక పాత్రలలో నటించారు. అయితే ఈ సిరీస్ లో ఆడియన్స్ ని థ్రిల్ చేయడానికి కావాల్సినంత కంటెంట్ ఉన్న కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదనే మాట వినిపిస్తోంది విజువల్ ప్రెజెంటేషన్ బాగున్న కూడా కథనం అంత ఎంగేజింగ్ గా లేదని టాక్ నడుస్తోంది. అలాగే క్యారెక్టర్స్ కూడా అంత స్ట్రాంగ్ గా లేవని అంటున్నారు. ట్విస్ట్ లు కూడా ఊహించగలిగే విధంగానే ఉన్నాయనే ప్రచారం నడుస్తోంది. ప్రీక్లైమాక్స్ నుంచి కథనం కాస్త ఎంగేజింగ్ గా ఉందంట. సిరీస్ లో క్యారెక్టరైజేషన్స్ అంత బలంగా లేవని క్రిటిక్స్ అంటున్నారు.

రైటింగ్ కూడా చాలా వీక్ గా ఉందని, ఆడియన్స్ కి ఇంటెరెస్ట్ క్రియేట్ చేసే బలమైన ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా సిరీస్ లో లేవనే మాట వినిపిస్తోంది. సిరీస్ లో నెగిటి రోల్ లో నటించిన అక్షర గౌడ పెర్ఫార్మెన్స్, అలాగే అశుతోష్ రానా, నందుల నటన కొంత పర్వాలేదనే విధంగా ఉందంట. మిగిలిన క్యారెక్టర్స్ ఏవీ కూడా గొప్పగా లేవని సినీ విమర్శకులు అంటున్నారు. అలాగే సిరీస్ డబ్బింగ్ క్వాలిటీ కూడా చాలా బ్యాడ్ గా ఉంటుందనే విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా స్టోరీ పరంగా ప్ర శాంత్ వర్మ 'ది మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' తో మెప్పించలేకపోయాడు. దర్శకుడిగా అనీష్ కురువిళ్ళ చాలా కాలం తర్వాత మెగా ఫోన్ పట్టారు. అయిన కూడా మేకింగ్ పరంగా కొత్తగా ఏమి ఎట్రాక్ట్ చేయలేదనే కామెంట్స్ వస్తున్నాయి.

## బ్లాక్ అండ్ వైట్ లో టైగర్ బ్యూటీ మెరుపులు

సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా నెట్టింట రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తున్న ముద్దుగుమ్మలు మంచి సినిమా ఆఫర్లు సైతం దక్కించుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో పెద్ద సినిమాల మేకర్స్ నుంచి చిన్న హీరోల మేకర్స్ వరకు సోషల్ మీడియాలో హీరోయిన్స్ షేర్ చేస్తున్న ఫోటోలను చూసి తమ సినిమాల్లో హీరోయిన్స్ గా ఎంపిక చేసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సినిమాల్లో హిట్ అవ్వని వారు సైతం సోషల్ మీడియాలో అందాల ఫోటోలు షేర్ చేసి ఆకట్టుకుంటున్నారు. ఇటీవల తెలుగు ప్రేక్షకులకు సేవ్ ది టైగర్స్ వెబ్ సిరీస్ తో పరిచయం అయిన ముద్దుగుమ్మ దేవియాని శర్మ. చాలా తక్కువ సమయంలోనే మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ఈమె సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఈ అందాల ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందంగా ఈ అమ్మడు ఉంది అంటూ



ముందూ వరుసగా ఫోటో షూట్స్ ను షేర్ చేస్తే తప్పకుండా ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అందుకే ఈమె ముందు ముందు తప్పకుండా సినిమాల్లో మరింత బిజీ అయ్యే అవకాశాలు లేకపోలేదు అనే అభిప్రాయంను ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు వ్యక్తం చేస్తున్నారు. సైతాన్, రొమాంటిక్, అనగనగా ప్రాజెక్ట్ ల్లో నటించినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయిన దేవయాని శర్మ సేవ్ ది టైగర్స్ సిరీస్ తో మాత్రం స్టార్ ఇమేజ్ ని సొంతం చేసుకుంది. అంతే కాకుండా సోషల్ మీడియాలో వరుసగా ఫోటోలను అది కూడా స్కిన్ షో ఫోటోలను షేర్ చేయడం ద్వారా నెటిజన్స్ కి చేరువ అయింది. ముందు ముందు ఈ అమ్మడు వరుసగా సినిమాలు, సిరీస్ ల్లో నటించాలని ఫాలోవర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. నెట్టింట ప్రస్తుతం ఈ అమ్మడి జోరు కొనసాగుతోం ది. ఈ బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు సైతం అందరి దృష్టిని ఆక్షిస్తున్నాయి.

## చీరందంలో శోభిత.. ఎంత అందంగా అంటే?

తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎంత మంది తెలుగు హీరోయిన్లు ఉన్నా శోభిత మాత్రం టాలీవుడ్ ని దాటి బాలీవుడ్ కి దూసుకెళ్లిన నటి. ట్రెండ్ కి తగ్గట్టు తనని తాను మౌల్డ్ చేసుకుంటూ నార్త్ బ్యూటీలకు ఏమాత్రం తక్కువ కాదని ప్రూవ్ చేస్తుంది. ఆ రకంగా ట్రెండ్ ని ఫాలో అవుతుంది కాబట్టే ఆ రేంజ్ లో ఫాలోయింగ్ దక్కించుకుంది. అందుకే ఇప్పుడు అక్కినేని నాగచైతన్యని ప్రేమ వివాహం చేసుకుంటుంది. శోభిత పుట్టింది తెనాలి అయినా! పెరిగింది అంతా విశాఖ పట్టణంలోనే. చిన్న నాటి నుంచి నార్త్ కల్చర్ కి అలవాటు పడిన బ్యూటీ. మోడ్రన్ కల్చర్ లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఆమె ఆలంకరణ..దుస్తులు ఎంపిక ప్రతీది



నార్త్ బ్యూటీని తలపిస్తుంది. తెలుగు సంప్రదాయంలో కనిపించడం అన్నది చాలా రేర్. వీలైనంత వరకూ ఆల్ట్రా మోడ్రన్ దుస్తుల్లో కనిపించడానికే ఎక్కువగా ఇష్టపడుతుంది. మరి ఇది చైతన్య తెచ్చిన మార్పా? తనలో కలిగిన మార్పా? అన్నది తెలియదు గానీ..తాజాగా శోభిత సంప్రదాయ చీరందంలో తళుక్కున మెరిసింది. ఇదిగో ఇక్కడిలా క్రీమ్ సారీ మ్యాచింగ్ బ్లౌజ్ లో ఎంతో అందంగా కనిపిస్తుంది. డిజైనర్ చెవులీలు...చేతికి ఎంపిక చేసుకున్న మ్యాచింగ్ యాక్సరసీస్...మ్యాకప్ ఇతర అలంకరణ ప్రీతీది శోభితని ఎంతో అందంగా తీర్చి దిద్దాయి. నుదిటిన ఎరుపు వర్ణం చిన్న బొట్టు మరింత ఆకర్షణీయంగా ఉంది. అన్నీక్లోజప్ షాట్స్ లోనూ వివిధ భంగిమల్లో శోభిత ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక శోభిక కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. క్రేజీ ప్రాజెక్ట్ ల్లో అవకాశాలు అందుకుంటుంది.



# బ్యాంకు లోన్లపై హైడ్రా సంచలన నిర్ణయం


హైదరాబాద్, సెప్టెంబర్ 24: రాష్ట్రంలోని బఫర్ జోన్, ఎఫ్టీఎల్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చివేతల్లోట జెట్‌స్పీడ్‌లో దూసుకెళ్తున్న హైడ్రా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్రమ నిర్మాణాలకు బ్యాంకులు లోన్లు ఇవ్వకుండా హైడ్రా కట్టడి చేయనుంది. ఈ మేరకు రెండు రోజుల్లో బ్యాంకర్లతో హైడ్రా చీఫ్ రంగనాథ్ సమావేశంకానున్నారు. దీనిపై ప్రభుత్వ రంగ ప్రైవేటు బ్యాంకులకు హైడ్రా లేఖ రాసింది. బఫర్ జోన్, ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కట్టడికి చర్యలు తీసుకుంటున్న హైడ్రా.. బ్యాంకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనుంది. లీగల్ టీంను కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సిద్ధం చేశారు. ఇటీవల కూల్చిన భవనాలు, విల్లాలకు లోన్లు ఇచ్చిన బ్యాంకు సంస్థల జాబితాను ఇప్పటికే హైడ్రా సిద్ధం చేసింది. చెరువుల్లో నిర్మాణాలకు అడ్డగోలుగా రుణాలు ఇవ్వడంపై హైడ్రా చీఫ్ రంగనాథ్ సీరియస్ అయ్యారు.

**జూన్‌లో మొదలైన కూల్చివేతలు..** కాగా.. జూన్ 26 నుంచి కూల్చివేతలు మొదలు పెట్టిన హైడ్రా బ్రేకుల్లేండా దూసుకెళ్తోంది. హైడ్రాకు ప్రభుత్వం కూడా హైపవర్స్ ఇచ్చేసింది. ఇప్పటి వరకు దాదాపు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను హైడ్రా కూల్చివేసింది. ఆక్రమణకు గురైన 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను కబ్జా చేస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించగా.. వెంటనే హైడ్రా సిబ్బంది రంగంలోకి దిగి కూల్చివేతలు చేస్తున్నాయి. హై రీచ్ జా క్రషర్స్‌తో పాటు జేసీబీలతో, బుల్డోజర్ల తో కూల్చివేతలు సాగుతున్నాయి. జీహెచ్ఎంసీతో పాటు జీహెచ్ఎంసీ ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు కొనసాగింది.

**ఇటీవల కూకట్‌పల్లి, అమీన్‌పూర్‌లో...** ఇటీవల కూకట్‌పల్లి, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు.

**నాన్‌స్టాప్ కూల్చివేతలు...** అమీన్ పూర్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. దాదాపు17 గంటలపాటు హైడ్రా నాన్ స్టాప్ కూల్చివేతలు చేపట్టింది. ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 16 విల్లాలను కూల్చివేసింది. హైడ్రా ఏర్పాటు తర్వాత తొలిసారిగా డే అండ్ నైట్ కూల్చివేతలు జరిగాయి. అక్రమ నిర్మాణాలకు ఆనుకొని ఉన్న పక్క ఇళ్లకు డ్యామేజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంది. సుమారు 17 గంటల పాటు హైరిస్క్ ఆపరేషన్‌ను హైడ్రా కొనసాగించింది.

# హైడ్రాపై ప్రభుత్వానికి సీపీఐ నేత హితవు



హైదరాబాద్, సెప్టెంబర్ 24: హైడ్రా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఐ సెక్రెటరీ కూనంనేని సాంబశివరావు పలు సూచనలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా పేరిట ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని హితవుపలికారు. గ్రేటర్ హైదరాబాద్ లాంటి సిటీలో అనేకమంది పేదలు నివాసం ఉంటున్నారని తెలిపారు. మూడు భాగాలుగా పేద వారు, మధ్య తరగతి, సంపన్నులను గుర్తించి కూల్చివేతలు చేయాలన్నారు. మంచి కోసం మొదలు పెట్టిన పని రేపటి రోజున ఇతర అంశాలకు దారి తీసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు సీపీఐ ఆధ్వర్యంలో సిటీలో అనేక చోట్ల చాలామంది పేదలు ఇళ్ళు కట్టుకున్నారని.. అలాంటి వాళ్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూసి వ్యవహరించాలన్నారు. ఖమ్మం జిల్లా మంత్రుల అత్యాశతో నాగార్జునసాగర్ కెనాల్‌కు రెండు చోట్ల గండి పడడం వాస్తవమన్నారు. "నేను మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మంతో పాటు మన జిల్లాకు కూడా నీళ్లు అందించా. మా హయాంలో సాగర్ కాలువకు గండి పడితే ఏడు రోజుల్లో పూర్తి చేశాం.. ఇప్పుడు 20 రోజులైనా దిక్కు లేదు. మీరు తెచ్చిన జీవో 33 వలన సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు ఎక్కువ నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో అప్పుడే పోలీసు రాజ్యం మొదలు పెట్టిండ్రు. వాళ్ల తప్పులపై ప్రశ్నించిన.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారు" అని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హైడ్రా సంచలన నిర్ణయం..** రాష్ట్రంలోని బఫర్ జోన్, ఎఫ్టీఎల్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చివేతల్లోట జెట్‌స్పీడ్‌లో దూసుకెళ్తున్న హైడ్రా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్రమ నిర్మాణాలకు బ్యాంకులు లోన్లు ఇవ్వకుండా హైడ్రా కట్టడి చేయనుంది. ఈ మేరకు రెండు రోజుల్లో బ్యాంకర్లతో హైడ్రా చీఫ్ రంగనాథ్ సమావేశంకానున్నారు. దీనిపై ప్రభుత్వ రంగ ప్రైవేటు బ్యాంకులకు హైడ్రా లేఖ రాసింది. బఫర్ జోన్, ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కట్టడికి చర్యలు తీసుకుంటున్న హైడ్రా.. బ్యాంకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనుంది. లీగల్ టీంను కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సిద్ధం చేశారు. ఇటీవల కూల్చిన భవనాలు, విల్లాలకు లోన్లు ఇచ్చిన బ్యాంకు సంస్థల జాబితాను ఇప్పటికే హైడ్రా సిద్ధం చేసింది. చెరువుల్లో నిర్మాణాలకు అడ్డగోలుగా రుణాలు ఇవ్వడంపై హైడ్రా చీఫ్ రంగనాథ్ సీరియస్ అయ్యారు.

# సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి టార్గెట్‌గా కేటీఆర్ కామెంట్స్..




హైదరాబాద్: హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని కేటీఆర్ ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. "ఎల్‌కేజీ చదివే వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదు.. 50 ఏళ్ళ కస్తూరి బాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది.. 72 గంటల క్రితం కొన్న ఇల్లు నేల మట్టమైంది.. వారం ముందు గృహప్రవేశం చేసుకున్న ఇల్లు, అన్ని కాగితాలు ఉన్నా.. పేక మేడల కూల్చివేయబడింది.. తిరుపతి రెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా.. మీ విషయంలో నోరు మెదపలేదు.. వాల్టా అనుకుంటా.. ఏకంగా మీకు 30 రోజుల టైం ఇచ్చింది.. కోర్టులో స్టే సంపాదించుకున్నారు.. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్టంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనా.. బుల్‌డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండి" అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

# కాళేశ్వరం డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారు?: జస్టిస్ పీసీ ఘోష్



హైదరాబాద్: కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఈఈ తిరుపతిరావు ఏజెన్సీలకు రూ.1,600 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినట్టు ఇంజినీర్లు తెలిపారు. బ్యాంకు గ్యారెంటీలను ఏజెన్సీలకు ఇచ్చే ముందు అండర్ టేకింగ్ ఏజెన్సీల నుంచి ఏమైనా తీసుకున్నారా అని కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్ అనుసరించకుండానే విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆనకట్టల వద్ద డ్యామేజ్‌కు గల కారణాలను కమిషన్ అడిగి తెలుసుకుంది. అనుకున్నదానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. 2022 జులైలో వచ్చిన భారీ వరదల కారణంగా సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. డ్యామేజి జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాసినట్లు కమిషన్‌కు వివరించారు.

డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారని కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ ప్రశ్నించగా.. వ్యాప్కోస్ సంస్థ తయారు చేసిందని సమాధానమిచ్చారు. సీడీఓ సీఈ అనుమతితో అమలు చేసినట్టు తెలిపారు. నిర్మాణానికి ముందు సైట్లలో ఏమైనా పరీక్షలు నిర్వహించారా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగినట్టు ఇంజినీర్లు వివరించారు.

# కేటీఆర్ బలుపు మాటలు తగ్గించుకో..సుద్దపూస ముచ్చట్లు ఆపు



హైదరాబాద్, సెప్టెంబర్ 24: పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గట్టి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ. కేటీఆర్ బలుపు మాటలు తగ్గించుకో అంటూ హితవుపలికాడు. "పదేళ్లలో పార్టీ ఫిరాయింపుల కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న నువ్వు నీతులు చెప్తావా. 60కి పైగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను చేర్చుకున్న నువ్వు కూడా ఫిరాయింపుల గురించి మాట్లాడతవా" అంటూ మండిపడ్డారు.

**ఆ వెధవన్నర వెధవ ఎవరు..** "ఆ నాడు ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యేలకు గులాబీ కండువా కప్పి చేర్చుకున్న వెధవ ఎవరు? ఆ నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి ప్రలోభపెట్టి, బెదిరించి చేర్చుకున్న సన్నాసి ఎవరు? ఆ నాడు విపక్ష శాసనసభ్యులతో రాయబారాలు నడిపి ప్రగతి భవన్‌కు తీసుకుపోయిన వెధవన్నర వెధవ ఎవరు? రోజుకో ఎమ్మెల్యేను చేర్చుకుని చివరకు విలీనం అంటు పచ్చి అబద్ధాలు చెప్పిన దగాకోరులు ఎవరు? పార్టీలకు పార్టీలను మింగేసి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అని నంగనాచి కబుర్లు చెపుతావా? పదేళ్ల పాటు నువ్వు, నీ అయ్య ప్రదర్శించిన అతి తెలివిని తెలంగాణ జనం చూశారు" అంటూ విరుచుకుపడ్డారు.




న్యూయార్క్: భారత ప్రధాని అమెరికా పర్యటన సందర్భంగా అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. భారత దేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోదీ అని, యూఎస్ చరిత్రలో భారత్‌కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్ అని ఆయన కొనియాడారు. ఇరు దేశాల ప్రజలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వీరిరువురి మధ్య చాలా స్నేహపూరిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి, సంబంధాలకు వీరి మధ్య ఉన్న స్నేహమే కారణమని పొగిడారు. భారత్ అమెరికా మధ్య పెరుగుతున్న స్నేహపూర్వక సంబంధాలు రెండు దేశాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, సాయుధ, సాంస్కృతిక సహకారంలో వృద్ధికి సహకరిస్తాయని గార్సెట్టి అన్నారు. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సును ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి శక్తివంతమైన వేదికగా పేర్కొన్నారు. "క్వాడ్ సదస్సు సభ్యదేశాల మధ్య ఒక విజన్, అభివృద్ధి, సహకారం, సమస్యల పరిష్కారం గురించి చర్చించే వేదిక. ఇండో-పసిఫిక్ సమస్యలకు పరిష్కారాలను రూపొందించడానికి మేము చురుగ్గా పని చేస్తున్నాం" అని గార్సెట్టి పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నివాసంలో క్వాడ్ సదస్సు నిర్వహించారు. ఇందులోభాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భాగస్వామ్య ఆందోళనలు, వ్యూహాలు, కూటమిలో భాగస్వాముల మధ్య సహకారం, భవిష్యత్తులో వేయాల్సిన అడుగులపై సదస్సులో నేతలు సమగ్రంగా చర్చించారు. సముద్రయాన భద్రత, లాజిస్టిక్స్ వ్యవస్థ, మానవతా సాయాన్ని బలోపేతం చేయడం, విపత్తుల సమయంలో పునరావాస చర్యల్లో సహకరించుకోవడంపైనా చర్చించుకున్నారు. సదస్సు సందర్భంగా 'విల్మింగ్టన్ డిక్లరేషన్' పేరుతో సభ్యదేశాల నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నాలుగు దేశాల కూటమి బలం మునుపటి కంటే పెరిగిందని క్వాడ్ పేర్కొంది. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య విలువలు, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు కట్టుబడి ఉంటామని, ఐరాస సహా ఎలాంటి ప్రపంచ వేదికల ద్వారా బలప్రయోగానికి పాల్పడబోమని పేర్కొంది. ప్రధాని మోదీ విడివిడిగా జపాన్ ప్రధాని ఫుమియో కిషిద, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌లతో సమావేశమయ్యారు. మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారం గురించి చర్చించారు. భారత్-జపాన్‌ల సంబంధాలు ప్రపంచ శ్రేయస్సుకు తోడ్పడతాయని అన్నారు. అనంతరం ఆయన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ద్వైపాక్షిక భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ మద్దతును మోదీ పునరుద్ఘాటించారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు.. మంత్రి తుమ్మల షాకింగ్ కామెంట్స్



ఖమ్మం: ఖమ్మంలో అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యంత్రాంగం చాలా బాగా పనిచేసిందని ప్రశంసించారు. ఇవాళ(మంగళవారం) కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తాగునీరు విద్యుత్ పునరుద్ధరణ సకాలంలో పూర్తి చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి మున్నేరు వరదల వల్ల మొత్తం 24 స్పాన్స్‌లో తొమ్మిది స్పాన్‌లు పక్కకు జరిగాయని అన్నారు. ఒక్కో స్పాన్ యథాతథ స్థితిలో బేరింగ్‌లు మార్చి పెట్టాలంటే పది రోజులు సమయం పడుతుందని చెప్పారు. బిల్డ్ కాన్ కంపెనీ నిర్వాహకులు బ్రిడ్జి మరమ్మతు పనులు చేస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మూడు నెలల్లో బ్రిడ్జిని యథాతథ స్థితికి తెస్తామని వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మున్నేరు పాత చప్టాపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పారు. రిటైనింగ్ వాల్ రీ డిజైన్‌పై అనుభవం ఉన్న కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నిపుణుల నివేదిక ఆధారంగా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే వందేళ్లకు విపత్తుల వల్ల ఇబ్బందులు లేకుండా మున్నేరు రిటైనింగ్ వాల్...డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మున్నేరుకు వరద తగ్గగానే పది రోజుల్లో ప్రకాశ్‌నగర్ వద్ద కాజ్‌వేపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పారు. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారుల వల్ల రింగు రోడ్డు ఏర్పాటుకు మార్గం సుగమైందని చెప్పారు. జాతీయ రహదారుల రింగు రోడ్డు వల్ల ఖమ్మంలో ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఉండబోతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం టూ సూర్యాపేట... ఖమ్మం టూ కోదాడ జాతీయ రహదారి పూర్తి అయిందని అన్నారు. ఖమ్మం టూ కురవి జాతీయ రహదారి పనులు వచ్చే ఉగాది నాటికి పూర్తి అవుతాయని వివరించారు. ఆయిల్ ఫాం పై ఇంపోర్ట్ టాక్స్ పెంచడం వల్ల పామాయిల్ రైతులకు అదనపు లాభాలు వస్తాయని చెప్పారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంచి మనస్సుతో పామాయిల్ రైతులకు మేలు చేశారని తెలిపారు. కరవు కాటకాలు విపత్తుల వల్ల ఆయిల్ ఫాంకు ఎలాంటి నష్టం రాదని చెప్పారు. తెలంగాణ రైతాంగం ఆయిల్ ఫాం సాగుబాట పట్టాలని సూచించారు. వరదల వల్ల రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ఆలస్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన డేటా వరకు రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆఖరి రైతు వరకు రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

# ములుగు మున్సిపాలిటీ బిల్లుకు ఆమోద ముద్ర వేయాలంటూ..



హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మంత్రి సీతక్క మంగళవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని గవర్నర్‌కు సీతక్క వినతి పత్రం సమర్పించారు. సాంకేతికపరమైన చిక్కులతో ములుగు మున్సిపాలిటీ బిల్లు ఇంతకాలం పెండింగ్లోనే ఉండిపోయిన విషయం తెలిసిందే.

గత ప్రభుత్వ తప్పిదాలతో మున్సిపాలిటీకి ములుగు నోచుకోని పరిస్థితి. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని గత ప్రభుత్వం చేర్చింది. అదే బిల్లులో జీహెచ్ఎంసీ చట్టానికి సవరణలు ప్రతిపాదించింది గత సర్కార్. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు గందరగోళంగా మారిపోయింది. సభ్యుల గందరగోళం నడుమ 2022లో బిల్లును అప్పటి ప్రభుత్వం పాస్ చేసింది. అయితే న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్‌లోనే ఉండిపోయింది. ఈ క్రమంలో బిల్లు వివరాలు గవర్నర్‌కు అందజేసిన మంత్రి సీతక్క.. ములుగుకు మున్సిపాలిటీ హోదా కల్పించే బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైఎస్ జగన్‌కి వీహెచ్ కీలక సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 24: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు పలు నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సీబీఐతో విచారణ జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు (వీహెచ్) సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో వీహెచ్ విలేకర్లతో మాట్లాడుతూ.. సీబీఐ విచారణ ప్రధాని నరేంద్ర మోదీ చేతిలోనే ఉంటుందన్నారు. దాంతో ఈ అంశాన్ని సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు నెలల్లో సీబీఐ విచారణను పూర్తి చేయాలన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదానికి వినియోగించిన నెయ్యిలో చేప నూనె, ఎద్దు కొవ్వు కలిపారని అంతా అంటున్నారన్నారు. ఇంత అపచారం నేను గతంలో ఎన్నడూ చూడలేదని తెలిపారు. తిరుమలలో భక్తులను స్వామి వారి దర్శనానికి పంపే విషయంలో అవినీతి జరిగిందంటే అనుకోవచ్చునని.. కానీ స్వామి వారి ప్రసాదం తయారీలో సైతం కరప్షనా? అని వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వినియోగించినట్లు ఎన్‌డీడీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన నిజనిజాలు వెలుగులోకి తీసుకు వచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ని ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఇక తిరుమల శ్రీవారి సన్నిధిలో ఘోర అపచారం నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం సోమవారం శాంతి హోమం నిర్వహించింది. ఆ తర్వాత శ్రీవారు కొలువు తీరిన ఆనంద నిలయంతోపాటు తిరుమాడ వీధుల్లో పూజారులు సంప్రోక్షణ నిర్వహించిన విషయం విధితమే.

# వికారాబాద్ జిల్లాలో ఉద్రిక్తత.. మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఘర్షణ

వికారాబాద్ జిల్లా: వికారాబాద్ జిల్లా మర్పల్లి పోలీస్ స్టేషన్ ముందు ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ - కాంగ్రెస్ రెండు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. మర్పల్లి మండలం పట్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను ఓ మర్డర్ కేసులో స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు చితకబాదినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దెబ్బలు తాళలేక పోలీసుస్టేషన్ నుంచి ఓ యువకుడు పారిపోయారు. పోలీసులు కొట్టిన విషయాన్ని యువకుడు గ్రామస్తులకు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన యువకులు కావడంతోనే పోలీసులు చితకొట్టారని గ్రామస్తులు ఆరోపించారు. సమాచారం తెలియడంతో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీస్ స్టేషన్‌కు మెతుకు ఆనంద్ వెళ్లిన సమయంలో కాంగ్రెస్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. మర్డర్ కేసులో అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తే కాంగ్రెస్, స్పీకర్‌ను ఎందుకు డౌన్ డౌన్ అంటున్నారంటూ కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నించారు.

పోటాపోటీగా ఇరువర్గాలు నినాదాలు చేశాయి. పోలీస్ స్టేషన్ ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు ఆందోళనకు దిగాయి. మెతుకు ఆనంద్‌ను పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు బయటకు పంపించి వేశారు. పోలీస్ స్టేషన్ ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేశాయి. దీంతో పోలీస్ స్టేషన్ దగ్గర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com